ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 02 సంచిక -339 పేజీలు - 8 వెల - 03/- శుక్రవారం 27 మార్చి 2026

పాత్రికేయులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా రిపబ్లిక్

తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు , జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.

ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888



# మరో ఘోరం

## 14 మంది సజీవదహనం

### మార్కాపురంలో టిప్పర్ లారీని ఢీకొన్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు





- మరో 20 మందికి గాయాలు
- హైదరాబాద్ నుంచి పామూరు వెళ్తుండగా ఘటన
- బస్సు డీజిల్ ట్యాంక్ పేలడంతో చెలరేగిన మంటలు
- ఏపీ బస్సు ప్రమాదంపై ప్రధాని దిగ్భ్రాంతి..
- మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు,
- గాయపడిన వారికి రూ.50వేలు పరిహారం
- ప్రమాదంపై సీఎం చంద్రబాబు సీఎం రేవంత్ విచారం.



**మార్కాపురం,మార్చి , 26,( రిపబ్లిక్ న్యూస్)**
మార్కాపురం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రాయవరం సమీపంలో పలకల క్వారీల వద్ద టిప్పర్‌ను ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. దీంతో బస్సుతో పాటు టిప్పర్‌లోనూ మంటలు చెలరేగాయి. ప్రమాదంలో బస్సులోని 14 మంది ప్రయాణికులు సజీవ దహనమయ్యారు. వారి మృతదేహాలను వెలికితీశారు. మరో 28 మందికి గాయాలయ్యాయి. ఘటనాస్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ప్రమాదంతో బస్సు, టిప్పర్ పూర్తిగా దగ్ధమయ్యాయి. బస్సును హరికృష్ణ ట్రావెల్స్‌కు చెందినదిగా గుర్తించారు. **మిగతా 2లో...**

## నేడు రాష్ట్రాలతో సిఎంలతో

# ప్రధాని వీడియో కాన్ఫరెన్స్

### పశ్చిమాసియా పరిస్థితులపై రాష్ట్రాల కు వివరించే ఛాన్స్

**న్యూఢిల్లీ,మార్చి , 26,( రిపబ్లిక్ న్యూస్)**
పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం మరింత అప్రమత్తమయ్యింది. ఈ క్రమంలో అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ప్రధాని మోదీ శుక్రవారం వర్చువల్‌గా సమావేశం కానున్నారు. శుక్రవారం సాయంత్రం 6.30గంటలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వారితో మాట్లాడనున్న ఆయన.. పశ్చిమాసియాలో పరిస్థితులు, భారత్ అనుసరిస్తున్న విధానాలను **మిగతా 2లో...**



# చర్చలంటూనే దాడులు

- బట్టబయలైన ట్రంప్ కుట్రం 0ఇరాన్ నేవీ చీఫ్ మృతి
- హార్ముజ్ గుండా వెళ్లే నౌకలపై ఇరాన్ టోల్ ఫీజు ?
- మిత్ర దేశాల నౌకలకు అనుమతి
- సీరియస్‌గా ఆలోచించాలంటూ ట్రంప్ హెచ్చరికలు





# అమరావతే రాజధాని



- ఎపి కేబినెట్ కీలక నిర్ణయాలు
- రాష్ట్ర రాజధానిగా అమరావతిని కొనసాగిస్తూ తీర్మానం
- కొత్త రాజధాని స్థానంలో అమరావతి పేరును చేర్చాలని నిర్ణయం
- 96 జూనియర్, సీనియర్ సివిల్ జడ్జిల కోర్టుల ఏర్పాటు
- వడ్డెర సంఘాలకు ప్రాధాన్యక్రమంలో ఖనిజ లీజులు
- ఆస్తి పన్ను బకాయిలపై వడ్డీ మాఫీ

**అమరావతి,మార్చి , 26,( రిపబ్లిక్ న్యూస్)**
రాజధాని అమరావతి అంశంపై ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసింది. రాష్ట్ర రాజధానిగా అమరావతిని కొనసాగిస్తూ, దానికి పూర్తిస్థాయిలో చట్టబద్ధత కల్పించేలా మంత్రివర్గం కీలక తీర్మానం చేసింది. గత కొంతకాలంగా సాగుతున్న న్యాయ, పరిపాలన పరమైన చిక్కులను తొలగించి, అమరావతి నిర్మాణ పనులను వేగవంతం చేసే దిశగా ఈ నిర్ణయం తీసుకున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ముగిసింది. ఈ భేటీలో రాష్ట్ర అభివృద్ధి, పాలనపరమైన అంశాలపై**మిగతా 2లో...**




# ముద్రగడ తో అంబటి భేటీ

- కిర్లంపూడిలో ముద్రగడను కలిసిన అంబటి
- ముద్రగడ కాపు కులంలో పుట్టినందుకు గర్విస్తున్నానని వ్యాఖ్య
- ఎన్ని కేసులు పెట్టినా తగ్గేది లేదన్న అంబటి
- తన పార్టీ, తన కులంతో కలిసి దేన్నైనా ఎదుర్కోవడానికి సిద్ధమన్న అంబటి

# ప్రపంచంలో మోస్ట్ పాపులర్ నేతగా ప్రధాని మోదీ...







# సర్కారీ బడుల్లో చేపల కూర..

### రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం

- ప్రభుత్వ బడుల్లో మధ్యాహ్న భోజనంలో చేపల కూర
- విద్యార్థుల కోసం ప్రత్యేకంగా తిలాపియా చేపల పెంపకం
- ఈ చేపలో ఒకే ముల్లు ఉండటంతో పిల్లలకు సురక్షితం
- అసెంబ్లీలో మంత్రి వాకిటి శ్రీహరి కీలక ప్రకటన

## స్పీకర్ ట్రైబ్యునల్, ఇద్దరు ఎమ్మెల్యేలకు

# తెలంగాణ హైకోర్టు నోటీసులు

**హైదరాబాద్ మార్చి , 26,( రిపబ్లిక్ న్యూస్)**
తెలంగాణ స్పీకర్ ట్రైబ్యునల్‌కు రాష్ట్ర హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఎమ్మెల్యేల అనర్హత విషయంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఇచ్చిన తీర్పుపై బీఆర్ఎస్ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై హైకోర్టు విచారణ చేపట్టింది. ఈ క్రమంలో స్పీకర్ ట్రైబ్యునల్‌తో పాటు **మిగతా 2లో...**



# అమరావతి తీర్మానం ఓ డ్రామా

### ప్రజలను మభ్య పెట్టే ఎత్తుగడ -రైతులను నిండా ముంచి మభ్య పెట్టారు

### మీడియా సమావేశంలో తీవ్ర విమర్శలు చేసిన వైసిపి నేత సజ్జల

**అమరావతి,,మార్చి , 26,( రిపబ్లిక్ న్యూస్)**
అమరావతి కోసం అసెంబ్లీలో తీర్మానం అన్నది చంద్రబాబు డ్రామా అని వైఎస్సార్‌సీపీ స్టేట్ కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి విమర్శించారు. ఇది ప్రజలను మభ్యపెట్టడానికి చేస్తున్న ఎత్తుగడ అని సజ్జల ధ్వజమెత్తారు. అమరావతి కోసం అసెంబ్లీలో చంద్రబాబు తీర్మానం పెట్టడంపై సజ్జల అనేక ప్రశ్నలు సంధించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ. **మిగతా 2లో...**



# చర్చలంటూనే దాడులు

**టెహ్రాన్, న్యూఢిల్లీ,మార్చి , 26,( రిపబ్లిక్ న్యూస్)**
ఇరాన్‌తో చర్చలు జరుగుతున్నాయని, ఐదు రోజులపాటు దాడులను వాయిదా వేస్తున్నామంటూ ట్రంప్ చేసిన ప్రకటన కుట్రపూరితమని తెలిపోయింది. ఆ ప్రకటన అనంతరం కూడా ఇరాన్‌పై దాడులు కొనసాగాయి. ఇజ్రాయిల్ జరిపిన దాడుల్లో గురువారం ఆ దేశ నేవీ చీఫ్ అలీరేజా మృతి చెందారు. ఇరాన్ సెంట్రల్ సిటీ ఇష్ఫాన్ సహా ఇరాన్ వ్యాప్తంగా విస్తృతంగా దాడులు జరిపినట్టు ఇజ్రాయిల్ మిలటరీ ప్రకటించింది. అనేక ప్రాంతాల్లో ఇరాన్ మౌలిక వసతులను లక్ష్యంగా చేసుకుని దాడులు జరిపినట్టు మిలటరీ ప్రకటన వెలువడింది. మరోవైపు అంతర్జాతీయంగా చమురు రవాణాకు అత్యంత కీలకమైనదిగా భావించే హార్ముజ్ జలసంధి మార్గంలో సాగే నౌకలకు టోల్ ఫీజు విధించే అంశంపై ఇరాన్ పార్లమెంట్ కసరత్తు చేస్తోంది.ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్‌కి అత్యంత సన్నిహితమైన ది ఫార్స్, తస్నిమ్ వార్తా సంస్థలు ఈ మేరకు కథనాలు ఇచ్చాయి. "ఇరాన్ సార్వభౌమాధికారాన్ని, నియంత్రణను, పర్యవేక్షణ ను అధికారికంగా ప్రకటించేందుకు ఒక ప్రణాళికను అనుసరించాలని ఇరాన్ పార్లమెంట్ భావిస్తోంది. అదే సమయంలో ఫీజు వసూలు చేయడం ద్వారా కొంతమేర ఆదాయం కూడా సృష్టించుకోవాలని యోచిస్తోంది." అని పార్లమెంట్ సభ్యుడు మహ్మద్‌రెజా కొచిని ఉటంకిస్తూ ఈ వార్తా సంస్థలు తెలిపాయి. "ఇది చాలా సర్వసాధారణం, ఇతర కారిడార్ల గుండా సాగేటప్పుడు చెల్లించే రవాణా ఫీజు మాదిరిగానే ఇక్కడ కూడా చెల్లించాల్సి ఉంటుంది. హార్ముజ్ జలసంధి కూడా ఒక కారిడారే." అని ఆ ఎంపీ వ్యాఖ్యానించారు. ఆ మార్గానికి భద్రతను మేం కల్పిస్తున్నపుడు నౌకలు, చమురు ట్యాంకర్లు అటువంటి ఫీజులు చెల్లించడం కూడా సాధారణమేనని ఆయన వ్యాఖ్యానించారు.

**నేవీ చీఫ్‌ను చంపేశాం : ఇజ్రాయిల్**
ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ నావికాదళ కమాండర్ అలీరెజా తంగ్సిరిని హత్య చేశామని ఇజ్రాయిల్ ప్రకటించింది. గతరాత్రి జరిగిన వైమానిక దాడుల్లో తంగ్సిరితో సహా ఇతర సీనియర్ నావికా కమాండర్లు మరణించినట్టు ఇజ్రాయిల్ రక్షణ మంత్రి ఇజ్రాయిల్ కట్జ్ తెలిపారు. కాగా ఈ వార్తను ఇరాన్ వెంటనే ధ్రువీకరించలేదు.

**ఇరాన్‌కు డ్రోన్లు డవార్తలు అబద్ధం : రష్యా**
ఇరాన్‌కు రష్యా డ్రోన్లు పంపుతోందంటూ వచ్చిన వార్తలను క్రెమ్లిన్ ఖండించింది. ఫైనాన్షియల్ టైమ్స్‌లో వచ్చిన ఆ వార్తలు అసత్యాలని పేర్కొంది. "మీడియాలో అనేక అబద్ధాలు ప్రచారమవుతున్నాయి. వాటిపై దృష్టి పెట్టకండి." అని క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కొవ్ విలేకర్లు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. టెహ్రాన్‌కు డ్రోన్లు పంపించే క్రమంలో రష్యా ఉందని, మార్చి నెలాఖరు నాటికి అది పూర్తవుతుందని పశ్చిమ దేశాల ఇంటెలిజెన్స్ అధికారులను ఉటంకిస్తూ ఫైనాన్షియల్ టైమ్స్ ఒక వార్తా కథనాన్ని ప్రచురించింది.

**పరోక్ష చర్చలు జరుగుతున్నాయన్న పాక్**
యుద్ధాన్ని ముగించేందుకు అమెరికా, ఇరాన్ మధ్య పరోక్ష చర్చలు జరుగుతున్నాయని పాకిస్తాన్ విదేశాంగ మంత్రి ఇషాక్ దర్ ధృవీకరించారు. ఈ 'శాంతి చర్చలు' గురించి వస్తున్న వదంతులన్నీ అనవసరమైనవని ఆయన వ్యాఖ్యానించారు. పాక్ మధ్యవర్తిత్వంతో ఈ చర్చల ప్రక్రియ సాగుతోందని తెలిపారు. టర్కీ, ఈజిప్ట్ వంటి దేశాలు ఇందుకు మద్దతునిస్తున్నాయన్నారు.

**చర్చల్లేవు.. అమెరికా ప్లాన్‌ను సమీక్షిస్తున్నామన్న ఇరాన్**
అమెరికాతో చర్చలు లేదా సంప్రదింపులు జరగడం లేదని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరగ్చి స్పష్టం చేశారు. అయితే మధ్యవర్తుల ద్వారా పలు సందేశాల మార్పిడి జరుగుతోందన్నారు. ఇరాన్ ఒప్పందాన్ని కుదుర్చుకోవాలని మమ్మల్ని వేడుకుంటోందని ట్రంప్ ప్రచారం చేసుకుంటుండగా అరగ్చి వాటిని కొట్టేపారేశారు. అందుకు భిన్నంగా అమెరికా ప్రతిపాదనను సమీక్షిస్తున్నామని మాత్రమే చెప్పారు. ప్రస్తుతానికి చర్చలు జరిపే ఆలోచన లేదన్నారు. 'మా వైఖరులను తెలియజేయడం లేదా అవసరమైన మేరకు హెచ్చరికలు జారీ చేసే సందేశాలే మధ్యవర్తుల ద్వారా సాగుతున్నాయని, వాటిని చర్చలు అని పిలవరాదని ప్రభుత్వ టెలివిజన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన స్పష్టం చేశారు.

# మరో ఘోరం

**మొదటిపేజీ తరువాయి**
గురువారం తెల్లవారు జామున ఆరుగంటల సమయంలో ఈ ఘోరం జరిగింది. ఘటనాస్థలికి పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను మార్కాపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముంది.బస్సు తెలంగాణలోని జగిత్యాల నుంచి నెల్లూరు జిల్లా కనిగిరికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఘటన జరిగిన సమయంలో బస్సులో 41 మంది ప్రయాణికులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. వీరిలో బస్సు వెనుక భాగంలో ఉన్నవారు బయటకు రాలేక మృతిచెందినట్లు తెలుస్తోంది. ముందు భాగంలో ఉన్నవారు ప్రాణాలతో బయటపడ్డారు. మృతుల్లో కనిగిరి, వింజమూరు, ఉదయగిరి ప్రాంతాలకు చెందిన వారు ఉన్నట్లు సమాచారం. ఘటనాస్థలాన్ని మార్కాపురం జేసీ శ్రీనివాసులు, ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పరిశీలించారు. మృతుల వివరాలు.. సీహెచ్ మనోజ్‌కుమార్ (18), వింజమూరు, సీహెచ్ సుజాత (45), వింజమూరు, సీహెచ్ మేఘన (19), వింజమూరు, టి. నరేంద్ర (25), నల్లగొండ్ల, టి. చందన (21), నల్లగొండ్ల, టి. చందు (6), నల్లగొండ్ల , కె. ప్రకాశ్ (17), అయ్యవారిపల్లె, కె.అయ్యన్న (18), (ఎర్రబొట్లపల్లె) వి. గురవయ్య (60), చింతగుంట్ల, కె.అబ్రహం (42), చోడవరం, పి.మహేంద్రరెడ్డి (17), చోడవరం రామచంద్ర ప్రవీణ్ (21), చోడవరం, ఎ.సౌజన్య (22), పెదారికట్ల ఉన్నారు. ఈ ప్రమాదంపై సీఎం చంద్రబాబు,ప్రధాని మోడీ, మంత్రులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బస్సులోని పలువురు ప్రయాణికులు సజీవ దహనం కావడంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. జిల్లా అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. తెలంగాణలోనినిర్మల్ నుంచి నెల్లూరుకు ఈ బస్సు వెళుతున్నట్లు అధికారులు తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలన్నారు. ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర విచారణ జరిపి నివేదిక సమర్పించాలని సీఎం ఆదేశించారు. బస్సు ప్రమాదంపై మంత్రులు నారా లోకేశ్, గొట్టిపాటి రవికుమార్, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, బీసీ జనార్దన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు.

మార్కాపురం సమీపంలో రాయవరం వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 13 మంది ప్రయాణికులు సజీవ దహనమైన ఘటనపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తోపాటు మంత్రులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 13 మంది సజీవ దహనం అయ్యారని తెలిసి తీవ్ర దిగ్భ్రాంతి కి లోనయ్యానని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. ఈ ప్రమాదానికి గల కారణాలను జిల్లా అధికార యంత్రాంగం నుంచి వివరాలు తీసుకున్నానని చెప్పారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య చికిత్స అందించాలని అధికారులకు స్పష్టం చేసినట్లు పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఈ మేరకు ఎక్స్ ఖాతా వేదికగా పవన్ కల్యాణ్ తెలిపారు. టిప్పర్‌ను ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టడంతో బస్సు పూర్తిగా అగ్నికి ఆహుతి కావడం అత్యంత విషాదకరమని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. ఈ దుర్ఘటనలో పలువురు సజీవదహనం కావడంపై తీవ్ర విచారాన్ని వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. తక్షణమే క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా ఉన్నతాధికారు లను మంత్రి అదేశించారు. ఈ ప్రమాద ఘటనపై జిల్లా కలెక్టర్, ఎస్పీలతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రమాద ఘటనపై సమాచారం అందగానే.. హుటాహుటిన విజయవాడ నుంచి రాయవరానికి హోం మంత్రి అనిత బయలుదేరారు. ఈ తరహా ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం అండగా ఉంటుందని బాధిత కుటుంబాలకు ఈ సందర్భంగా మంత్రి అనిత భరోసా ఇచ్చారు. ఈ ప్రమాద ఘటన కారణంగా చేపట్టిన సహాయక చర్యలను మంత్రి అనిత ఎప్పటికప్పుడు అధికారులను అడిగి తెలుసుకుంటున్నారు. రాయవరం వద్ద ప్రమాద ఘటనలో మృతుల ఆత్మలకు శాంతి కలగాలని దేవుడిని ప్రార్థిస్తున్నట్లు మంత్రి సవిత తెలిపారు. 13 మంది ప్రయాణికులు సజీవ దహనం కావడంపై విచారం వ్యక్తం చేశారు. బాధిత కటుంబాలకు అండగా ఉంటామన్నారు. క్షతగాత్రులను మెరుగైన వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు. మృతులు, క్షతగాత్రుల వివరాలు సేకరించి.. వాటిని వారి బంధువులకు తెలియపర్చాలని మార్కాపురం జిల్లా కలెక్టర్, ఎస్పీలకు ఆదేశించినట్లు తెలిపారు. ప్రయాణాల్లో నిబంధనలు పాటించాలని డ్రైవర్లకు సూచించారు. నిరంతరం అప్రమత్తంగా ఉండాలంటూ బస్సు డ్రైవర్లకు స్పష్టం చేశారు. బస్సుల్లో ప్రయాణికులను జాగ్రత్తగా గమ్యస్థానాలకు చేర్చేలా చూడాలని వారిని మంత్రి సవిత కోరారు.

సజీవ దహనం ఘటన తీవ్ర ఆవేదనకు గురి చేసిందని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పలకల క్వారీల వద్ద టిప్పర్‌ను ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకోవడం అత్యంత దురదృష్టకరమని పేర్కొన్నారు. ప్రమాదంలో గాయపడ్డ క్షతగాత్రులకు మెరుగైన వైద్య సహాయం అందించాలని జిల్లా అధికారులకు మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆదేశించారు. ఘటనాస్థలిలో బాధితులకు సహాయ చర్యలు ముమ్మరం చేయాలని మంత్రి సూచించారు. ఈ ప్రమాద ఘటనపై మంత్రి గొట్టిపాటి రవి కుమార్ దిగ్భ్రాం÷-రతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ హామీ ఇచ్చారు. ఈ ప్రమాదంపై సమాచారం అందిన వెంటనే అధికారులు, స్థానిక ఎమ్మెల్యేతో మంత్రి గొట్టిపాటి మాట్లాడారు. ఈ ప్రమాదానికి సంబంధించిన వివరాలను మంత్రి గొట్టిపాటికి అధికారులు వివరించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. బస్సులో ప్రయాణికులు సజీవ దహనం కావడంపై తీవ్ర విచారకరమన్నారు. మృతుల కుటుంబాలకు ఆయన తన సానుభూతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నానని మంత్రి గొట్టిపాటి తెలిపారు.

# అమరావతే రాజధాని

**మొదటిపేజీ తరువాయి**
చర్చించి పలు కీలక నిర్ణయాలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఏపీ పునర్విభజన చట్టం 2014లోని సెక్షన్-5ను సవరించాల్సిందిగా మంత్రివర్గం తీర్మానం చేసింది. కొత్త రాజధాని స్థానంలో అమరావతి పేరును చేర్చాలని ప్రభుత్వం భావిస్తోంది. అంతేకాకుండా నీరుకొండలో ఎస్ఆర్ఎం వర్సిటీ, 60 మీటర్ల ఎత్తు వరకు అకడమిక్ భవనాల నిర్మాణానికి క్యాబినెట్ అనుమతి ఇచ్చింది. అలాగే రాష్ట్రంలో 96 జూనియర్, సీనియర్ సివిల్ జడ్జిల కోర్టుల ఏర్పాటుకు ఆమోదం ఇచ్చింది. వడ్డెర సంఘాలకు ప్రాధాన్యక్రమంలో ఖనిజ లీజుల కేటాయింపులపై చర్చించారు. ఖనిజ లీజుల కేటాయింపులో ప్రీమియం, సీనరేజ్ ఫీజుల్లో 50శాతం రాయితీఇవ్వనున్నారు. కుప్పం బాలికల పాఠశాలలో పీఈటీ, నర్సు, రికార్డు అసిస్టెంట్ పోస్టుల మంజూరుకు ఆమోదం ఇచ్చింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఆస్తి పన్ను బకాయిలపై వడ్డీ మాఫీ చేసింది. జలవనరుల శాఖలో వివిధ ప్రాజెక్టుల ఆధునికీకరణ, మరమ్మతులకు పరిపాలన అనుమతులు ఇచ్చారు. వివిధ సంస్థలకు భూ కేటాయింపులపై రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకున్నది. ఎలక్ట్రిక్ ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని మంత్రి వర్గం నిర్ణయించింది. కొత్త రాజధానిగా సీఆర్డీఏ చట్టం పరిధిలోని అమరావతి పేరు చేర్చాలని క్యాబినెట్ తీర్మానించింది. 28న అసెంబ్లీలో 4 గంటలపాటు చర్చించి తీర్మానించాలని నిర్ణయించింది. రాజధాని చరిత్రను ప్రజలకు తెలియ జేయాలని సీఎం చంద్రబాబు క్యాబినెట్‌కు సూచించారు. క్యాబినెట్ సమావేశంలో భాగంగా విద్యుత్ వ్యవస్థపై ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఏప్రిల్ 5 నుంచి 14 లోపు ప్రతి నియోజకవర్గంలో 2 వేల చొప్పున సూర్యఘర్ కనెక్షన్లు ఇవ్వాలని నిర్ణయించారు. పీఎం కుసుమ్ ద్వారా పవర్ లాస్‌లు తగ్గించేలా చూడాలని దిశానిర్దేశర చేశారు. బ్యాటరీ స్టోరేజ్ వ్యవస్థల్ని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ల వద్ద ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సాంకేతికత అందిపుచ్చుకుంటూ సంస్కరణలు తీసుకొస్తూ విద్యుత్‌శాఖ ముందుకెళ్లాలని సూచించారు. ఆదాయంలో 99శాతం జీతాలకే సరిపోతోంది. కేంద్ర సాయం అప్పులు, వడ్డీలు కట్టేందుకే సరిపోతోంది. క్లిష్టపరిస్థితు ల్లోనూ సంక్షేమం అందిస్తూ అభివృద్ధి దిశగా నడిపిస్తున్నాం. కేంద్ర పథకాలను ఎక్కువగా మనం ఉపయోగించుకుంటున్నాం. ఈ పార్లమెంట్ భేటీలోనే రాజధానిగా అమరావతి చట్టబద్ధత సవరణ బిల్లు పెడతారు' అని సీఎం చంద్రబాబు అన్నారు.

# నేడు సిఎంలతో ప్రధాని వీడియో కాన్ఫరెన్స్

**మొదటిపేజీ తరువాయి**
వివరించనున్నట్లు సమాచారం. అదేవిధంగా ఆయా రాష్ట్రాల సన్నద్ధత, సహకారంపై చర్చించనున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. వచ్చే నెలలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల ముఖ్యమంత్రులు మాత్రం ఈ సమావేశానికి దూరంగా ఉండనున్నట్లు తెలిసింది. అయితే, ఆయా రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులతో కేబినెట్ సెక్రటరీ ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. ప్రధాని-సీఎంల వీడియో కాన్ఫరెన్స్‌లో తీసుకున్న వివరాలను సీఎస్‌లకు వెల్లడించి.. ఆయా రాష్ట్రాల్లో అమలు చేసేలా కేబినెట్ సెక్రటరీ సూచించనున్నట్లు సమాచారం. ఇటీవల పార్లమెంటు ఉభయసభల్లో మాట్లాడిన ప్రధాని మోదీ.. యుద్ధం వల్ల ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న సంక్లిష్ట పరిస్థితులు దీర్ఘకాలం కొనసాగే అవకాశాలు ఉన్నాయన్నారు. ఇది పరీక్షా సమయమేనని తెలిపారు. సంక్షోభం నుంచి బయటపడటంలో రాష్ట్రాలన్నీ కేంద్రంతో కలిసి టీమ్ ఇండియాలా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు ప్రజలు సిద్ధమై ఉండాలని కోరారు. ఈ క్రమంలోనే అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సమావేశానికి సిద్ధమవడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సమావేశంలో పశ్చిమాసియా యుద్ధం కారణంగా తలెత్తిన సంక్షోభంపై కీలక సూచనలు చేయనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం దేశంలో చమురు, గ్యాస్‌పై విపరీతంగా వదంతులు వ్యాపిస్తున్నాయి. మధ్యప్రాచ్యం యుద్ధం కొనసాగితే.. ఎదురయ్యే ఇబ్బందులను ఎలా ఎదుర్కోవాలన్న దానిపై మోడీ దిశానిర్దేశర చేయనున్నారు. గత నెల 28 నుంచి పశ్చిమాసియాలో యుద్ధం జరుగుతోంది. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా దాడి చేశాయి. ఈ ఘటనలో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా లీ ఖమేనీ హతమయ్యాడు. దీంతో ఇరాన్ ప్రతీకార దాడులకు దిగింది. గల్ఫ్ దేశాల్లోని ఇంధన, గ్యాస్ క్షేత్రాలపై క్షిపణులతో విరుచుకుపడింది. అంతేకాకుండా హార్ముజ్ జలసంధిని కూడా మూసేసింది. దీంతో ప్రపంచ దేశాల్లో చమురు, గ్యాస్ కష్టాలు తీవ్ర స్థాయికి చేరాయి. ఇప్పటికే ఆయా దేశాల్లో అత్యవసర పరిస్థితులు అమలు అవుతున్నాయి. అలాగే భారత్‌లో కూడా కరోనా కాలం నాటి లాక్‌డౌన్ పరిస్థితులు వస్తాయంటూ పుకార్లు వ్యాప్తి చెందుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రధాని మోడీ.. అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సమావేశం నిర్వహించడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

# అమరావతి తీర్మానం ఓ డ్రామా

**మొదటిపేజీ తరువాయి** .
అమరావతి పేరిట అవినీతి నుంచి, రైతులకు పరిష్కారం కాని అంశాల నుంచి పక్కదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. అమరావతి కోసం అసెంబ్లీలో తీర్మానం చేయాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది? , ఎవరు అభ్యంతరం చెప్పారు, ఎవరు అడ్డంకులు చెప్పారన్న దానికి చంద్రబాబు వివరణ ఇవ్వాలన్నారు. అసెంబ్లీలో తీర్మానం చేసి, అంతా చేసేశానని చంద్రబాబు చెప్పుకోవాలని అనుకుంటున్నారు. అసెంబ్లీతో పాటు, మండలిని కూడా సమావేశపరచాలి కదా?, కానీ, అమరావతి లో చంద్రబాబు అవినీతి, వ్యవహరిస్తున్న తీరును ప్రశ్నిస్తారనే మండలిని పిలవటం లేదా అని నిలదీసారు. శాశ్వత రాజధానిని నిర్మించి, ప్రజలకు వేగంగా అందుబాటులోకి తీసుకురావాలన్న ఆలోచన చంద్రబాబు ఎప్పుడూ చేయలేదు, అలాకాకుండా రాజధాని అంశాన్ని శాశ్వత కామధేనువుగా మార్చాడు, అమరావతిలో చంద్రబాబు అవినీతి యజ్ఞం చేస్తున్నారు' అని సజ్జల మండిపడ్డారు. ÷ూజధాని విషయంలో చంద్రబాబుకు ఆచరాణాత్మక ధోరణి ఇప్పటికీ లేదు. వైఎస్సార్‌సీపీ అభివృద్ధి వికేంద్రీకరణలో అమరావతికీ స్థానం ఉంది, అయితే ఇదంతా గతంలో జరిగిన పరిణామాలు. ఇప్పుడు మళ్లీ చంద్రబాబు అధికారంలోకి వచ్చారు, వచ్చాక కూడా ఏమీ చేయడం లేదు. చంద్రబాబు ఊహాజనిత రాజధాని, దానికయ్యే ఖర్చు ఎంత అవుతుంది అన్నదానిపై మేం ప్రశ్నలు వేశాం. అంతే తప్ప అమరావతి ప్రాంతానికి ఎప్పుడూ జగన్ వ్యతిరేకం కాదు. అందుకనే 2019లో అధికారంలోకి రాకముందే జగన్ ఇక్కడ ఇల్లు కట్టుకున్నారు. అమరావతి ప్రాంతానికి వైఎస్సార్‌సీపీ ఆ రోజూకాని, ఈ రోజుకాని ఎప్పుడూ అభ్యంతరం చెప్పలేదు. మేం అభ్యంతరం వ్యక్తం చేసేది అవినీతి మీద, దోపిడీ మీద. రైతుల సమస్యలను ఇప్పటికీ పరిష్కరించలేదు. పిల్లల పెళ్లిళ్లు కూడా రైతులు చేయలేకపోతున్నారు.

చంద్రబాబు ప్రణాళిక ప్రకారం కనీస మౌలిక సదుపాయాల కోసం రూ.2 లక్షల కోట్లు కావాలి. 2014-19లో ఐదేళ్లలో ఖర్చు చేసింది రూ.5వేల కోట్లే. ఇప్పుడు కూడా చేసింది ఏమీ లేదు. ఇప్పుడు చదరపు అడుగుకు రూ.19వేల వరకూ పెంచారు. అమరావతిలో పాత బిల్డింగులు కాక, ఈ రెండేళ్లలో కొత్తగా కట్టారా?, మళ్లీ డిజైన్ల పేరిట రూ.400 కోట్లు ఖర్చుచేస్తున్నారు. 2018లో టెండర్లు ఖరారై, పనులు ప్రాంభమైన వాటికి కూడా మళ్లీ టెండర్లు పిలిచారు. కాంట్రాక్టర్లతో గూడు పుఠానీ చేశారు. అందరికీ 4శాతం కంటే ఎక్కువ టెండర్లు ఖర్చు పెట్టారు. చంద్రబాబు తీరును చూసి, అమరావతి పేరిట చేసిన దోపిడీని చూసి రాష్ట్రం భయపడతోంది. చంద్రబాబు సృష్టించిన అవినీతి ఊబిలో రాష్ట్రం ఎక్కడకు పోతుందో తెలియడంలేదు. ప్రజల సొమ్ము, రాష్ట్ర వనరులను పీల్చి పిప్పిచేస్తున్నారు.

# ప్రపంచంలో మోస్ట్ పాప్యులర్ నేతగా ప్రధాని మోదీ...

**న్యూఢిల్లీ,మార్చి , 26,( రిపబ్లిక్ న్యూస్)**
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రపంచంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన నేతగా మరోసారి నిలిచారు. అమెరికాకు చెందిన ప్రముఖ డేటా అనలిటిక్స్ సంస్థ 'మార్నింగ్ కన్సల్ట్' నిర్వహించిన సర్వేలో ఆయన 68 శాతం అప్రూవల్ రేటింగ్‌తో అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నారు. మార్చి 2 నుంచి 8వ తేదీ మధ్య ఈ సర్వే నిర్వహించారు. ఈ సర్వే ఫలితాలను బీజేపీ నేతలు స్వాగతిస్తూ, ప్రధానిపై ప్రశంసలు కురిపించారు.
ఈ విషయంపై ఉత్తరప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్య స్పందిస్తూ, "ప్రధాని మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పటి నుంచే ఉత్తమ నేత. ఇప్పుడు ప్రధానిగా ప్రపంచంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన నాయకుడిగా కొనసాగుతున్నారు. కేవలం సర్వేల ఆధారంగానే కాకుండా, ఆయన జీవితాంతం చేసిన సేవ వల్లే ఈ గుర్తింపు లభించింది" అని అన్నారు.యూపీ మంత్రి డానిష్ ఆజాద్ అన్సారీ మాట్లాడుతూ, "మోదీ నాయకత్వంలో భారత్ అభివృద్ధిలో కొత్త శిఖరాలను అందుకుంది. ప్రపంచ పురోగతిలో భారత్ కీలక పాత్ర పోషిస్తుందని నిరూపించాం. ఆయన నాయకత్వం వల్లే ప్రపంచ దేశాలతో మన సంబంధాలు బలపడ్డాయి" అని వివరించారు. ఇదే అభిప్రాయాన్ని బీజేపీ ఎంపీ ప్రవీణ్ ఖండేల్వాల్, మహారాష్ట్ర మంత్రి గిరీష్ మహాజన్ కూడా వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ ప్రపంచంలోనే అత్యంత ప్రసిద్ధ నాయకుడని, ఆయన పనితీరు దేశానికి గర్వకారణమని వారు కొనియాడారు. ఈ ఘనత సాధించినందుకు ప్రధాని మోదీకి దేశం తరపున అభినందనలు తెలిపారు.

# ముద్రగడ తో అంబటి భేటీ

**అమరావతి,,మార్చి , 26,( రిపబ్లిక్ న్యూస్)**
ఏపీ రాజకీయాల్లో కాపు సామాజికవర్గ సమీకరణాలు మళ్లీ వేడెక్కుతున్నాయి. కాకినాడ జిల్లా కిర్లంపూడిలో వైసీపీ నేత ముద్రగడ పద్మనాభంను మాజీ మంత్రి అంబటి రాంబాబు కలిశారు. ఈ సందర్భంగా అంబటి మాట్లాడుతూ ముద్రగడ పట్టుదల, నిజాయతీని ప్రశంసించారు. గతంలో ముద్రగడ కుటుంబాన్ని పోలీసులు ఇబ్బంది పెట్టారంటూ, ప్రస్తుత ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ముద్రగడ తమ కాపు కులంలో పుట్టినందుకు గర్విస్తున్నానని చెప్పారు. తనపై ఎన్ని కేసులు పెట్టినా, ఎన్ని ఇబ్బందులు ఎదురైనా వెనక్కి తగ్గేది లేదని, తన కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు పోరాడుతూనే ఉంటానని అంబటి స్పష్టం చేశారు. ముఖ్యంగా పోలీసులు తనను హింసించారని, అర్ధరాత్రి వేళల్లో ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. బెయిల్ వచ్చిన తర్వాత కూడా మళ్లీ కేసు పెట్టారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ లను వదిలేది లేదని హెచ్చరించారు. తన పార్టీ, తన కులంతో కలిసి దేన్నైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు.

## స్పీకర్ ట్రైబ్యునల్, ఇద్దరు ఎమ్మెల్యేలకు

# తెలంగాణ హైకోర్టు నోటీసులు

**మొదటిపేజీ తరువాయి**
అనర్హత ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, సంజయ్ కుమార్‌కు కూడా నోటీసులు జారీ చేసింది.పార్టీ మారిన ఇద్దరు ఎమ్మెల్యేలపై సభాపతి ట్రైబ్యునల్ చర్యలు తీసుకోలేదని బీఆర్ఎస్ తరఫు న్యాయవాది కోర్టుకు వివరించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో వారు బీఆర్ఎస్ నుంచి గెలిచి ఆ తర్వాత కాంగ్రెస్ లోకి మారారని కోర్టుకు తెలిపారు.అయినప్పటికీ స్పీకర్ చర్యలు తీసుకోలేదని అన్నారు. స్పీకర్ ట్రైబ్యునల్ నిర్ణయాన్ని రద్దు చేయాలని కోరారు. అలాగే పార్టీ మారిన ఆ ఇద్దరు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం తదుపరి విచారణను ఏప్రిల్ 16వ తేదీకి వాయిదా వేసింది.

# సర్కారీ బడుల్లో ఇక చేపల కూర..

## రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం

**హైదరాబాద్ మార్చి , 26,( రిపబ్లిక్ న్యూస్)**
తెలంగాణలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రేవంత్ రెడ్డి సర్కార్ ఒక తీపి కబురు అందించింది. ఇప్పటికే మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా సన్నబియ్యంతో పాటు పౌష్టికాహారం అందిస్తుండగా, ఇకపై ఆ మెనూలో చేపల కూరను కూడా చేర్చనున్నట్లు ప్రకటించింది. ఈ విషయాన్ని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అసెంబ్లీలో వెల్లడించారు.సభలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిస్తూ ఈ ప్రకటన చేశారు. విద్యార్థులకు మరింత నాణ్యమైన పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. "మధ్యాహ్న భోజన పథకంలో చేపల కూరను అందిస్తాం. ఈ అంశంపై ఇప్పటికే కేబినెట్‌లో చర్చించాం" అని ఆయన వివరించారు.పిల్లల భద్రతను దృష్టిలో ఉంచుకుని, వారి కోసం ప్రత్యేకంగా 'తిలాపియా' అనే జాతి చేపలను పెంచనున్నట్లు మంత్రి తెలిపారు. "ఈ చేపకు మధ్యలో ఒక్కటే వెన్నుముల్లు ఉంటుంది. కాబట్టి పిల్లలు ఎలాంటి ఇబ్బంది లేకుండా తినవచ్చు. వీటిని ప్రత్యేకంగా పెంచి విద్యార్థులకు అందిస్తాం" అని శ్రీహరి పేర్కొన్నారు. రాష్ట్రంలో బలమైన పశుసంపద ఉందని, గుడ్ల ఉత్పత్తిలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో ఉందని ఆయన గుర్తుచేశారు. అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలపడంతో పాటు, గ్రామస్థాయిలో క్రీడలను బలోపేతం చేసేందుకు కూడా ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని మంత్రి తెలిపారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
శుక్రవారం 27 మార్చి 2026

### పాణ్యం నియోజకవర్గ వైఎస్సార్సీపీ క్యాంపు కార్యాలయంలో

## సర్పంచ్ ఎంపీటీసీ,జడ్పీటీసీ లకు,సన్మానం



**పాణ్యం, ప్రతినిధి,26,మార్చి, (ప్రజారిపబ్లిక్ న్యూస్)** నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అధ్యక్షతన కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పాణ్యం, గడివేముల మండలాలకు చెందిన వైఎస్సార్సీపీ సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీ సభ్యులు మరియు కార్యకర్తలు భారీగా హాజరయ్యారు.సమావేశం ముఖ్య ఉద్దేశ్యం సర్పంచుల పదవీకాలం ముగిసిన నేపథ్యంలో వారు గ్రామాల అభివృద్ధికి చేసిన సేవలను మరోసారి గుర్తుచేసుకోవడం, అలాగే రాబోయే సర్పంచ్ ఎన్నికల్లో వైఎస్సార్సీపీ పార్టీని మరింత బలోపేతం చేసి విజయపథంలో నడిపించడం. ప్రతి సర్పంచ్, ప్రతి కార్యకర్త పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని కాటసాని రాంభూపాల్ రెడ్డి పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా గడివేముల మండలానికి చెందిన సర్పంచులు, పాణ్యం మండలానికి చెందిన ఎంపీటీసీలు, జడ్పీటీసీ సభ్యులు తమ అనుభవాలను, సూచనలను కార్యకర్తలతో పంచుకున్నారు.

ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా పార్లమెంటరీ సెక్రటరీ మరియు జిల్లా అబ్జర్వర్ సద్దల సూర్యనారాయణ రెడ్డి, జడ్పీటీసీ సద్దల సరళమ్మ, పాణ్యం ఎంపీపీ హుస్సేన్ బి, గడివేముల జడ్పీటీసీ బీఆర్ చంద్రశేఖర్ రెడ్డి, గడివేముల ఎంపీపీ నారాయణమ్మతో పాటు వైఎస్సార్సీపీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# దళిత యువకుడు ప్రభు కిరణ్ మరణం పై పోలీసు యంత్రాంగం సమగ్ర విచారణ జరపాలి

### బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి - మైసగళ్ళ బుచ్చేంద్ర మాదిగా ఎం.ఆర్.పి.ఎస్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు

**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి మార్చి 26(రిపబ్లిక్ న్యూస్)**
హత్నూర మండలం లింగాపూర్ గ్రామంలో గత సోమవారం దళిత యువకుడైన నాయికోటి ప్రభు కిరణ్ మరణం అనుమానాస్పదంగా మరణించడం జరిగింది,గ్రామానికి చెందిన శివ శంకర్ గౌడ్ మద్యం అంటే బీరు తాగుదామని తీసుకెళ్లి రాత్రి సమయంలో ఇద్దరు మద్యం సేవించి ప్రభుకిరణ్ ను ఒక్కడే మరి ఇంటికి తీసుకొచ్చి కుటుంబ సభ్యులకు తెలియకుండా ఆస్పత్రికి తీసుకెళ్లడం జరిగింది ఇట్టి విషయంలో కుటుంబ సభ్యులకు తెలియకుండా సమాచారం ఇవ్వకుండా ఆసుపత్రికి తీసుకెళ్లడం అనుమానాస్పదంగా కనిపిస్తుంది మృతి చెందిన ప్రభు కిరణ్ శరీరంపై అక్కడక్కడ మాసిన గాయాలు కనిపిస్తున్నాయి ఈ మృతి పై పోలీసు యంత్రాంగం నిష్పక్షపాతంగా విచారణ చేయాల్సిందిగా విజ్ఞప్తి చేస్తూ 20 సంవత్సరాల దళిత యువకుడు అనుమానాస్పదంగా మరణించడం కుటుంబ సభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు ఎదిగిన కుమారుడు అనుమానాస్పదంగా మరణించడం కుటుంబానికి



తీవ్ర శోకాన్ని మిగిల్చింది ,
ఇట్టి విషయంలో ఎం.ఆర్.పి.ఎస్ బృందం భాదిత కుటుంబాన్ని పరామర్శించడం జరిగింది, పోస్టుమార్టం రిపోర్ట్ ఇంకా ఫోరెన్సిక్ ల్యాబ్ నమూనాలు నిష్పక్షపాతంగా జరగాలని పోలీస్ యంత్రాంగం కూడా పూర్తిస్థాయిలో సమగ్ర విచారణ చేసి కుటుంబానికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాంఇట్టి విషయంలో ఎమ్మార్పీఎస్ కుటుంబానికి అండగా ఉంటుందని, మాదిగ సమాజం దళిత సమాజం అండగా ఉంటుందని తెలియజేస్తూ బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

ఈ కార్యక్రమంలో గంధగళ్ళ వీరయ్య మాదిగ ఎం.ఎస్.పి జిల్లా గౌరవ అధ్యక్షులు కోర్పోల్ శ్రీహరి పొట్లగళ్ల శంకర్ ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

## వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సర్పంచుల పదవీకాలం ముగిసిన సందర్భంగా వారికి ఘనంగా సన్మానం చేసిన పాణ్యంమాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి

**గడివేముల ప్రతినిధి, మార్చి 26,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
గడివేముల పాణ్యం మండలాలకు చెందిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సర్పంచుల పదవీకాలం ముగిసిన సందర్భంగా వారికి ఘనంగా సన్మాన

కార్యక్రమం నిర్వహించిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రామభూపాల్ రెడ్డిఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వర్యులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాలతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి నాయకత్వంలో ప్రజలకు సంక్షేమ,సుపరిపాలన అందించిన గడివేముల మరియు పాణ్యం మండలాలకు చెందిన సర్పంచుల సేవలను ప్రశంసించి, సర్పంచులకు శాలువాలు కప్పి, పుష్పగుచ్చాలు అందజేసి ఘనంగా సత్కరించిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులు,



పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేసే గ్రామ అభివృద్ధికి కృషిచేసిన ప్రతి సర్పంచ్ అభినందనీయులని తెలిపారు.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలో గ్రామాభివృద్ధి దిశగా జరగడం మార్పులు సర్పంచుల కృషి వల్లనే సాధ్యమయ్యాయని అన్నారు.ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకొని, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేసి గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపినందుకు సర్పంచులకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.భవిష్యత్తులో కూడా పార్టీకి బలంగా నిలిచి ప్రజాసేవలో ముందుండాలని పిలుపునిచ్చారు.పదవులు ఉన్నా లేకపోయినా పార్టీ కోసం ప్రతి ఒక్కరూ పనిచేయాలి, పార్టీ బలోపేతం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని కాటసాని రామభూపాల్ రెడ్డి అన్నారు.ఈ కార్యక్రమంలో గడివేముల జడ్పిటిసి ఆర్ బి చంద్రశేఖర్ రెడ్డి, పాణ్యం మాజీ జడ్పిటిసి సూర్యనారాయణ రెడ్డి మరియు గడివేముల, పాణ్యం మండలాల నాయకులు,గ్రామ నాయకులు, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు

## ఓర్వకల్లు జయరాజ్ స్టీల్ ప్లాంట్లో భద్రతా చర్యలు చేపట్టాలి




**ఓర్వకల్లు ప్రతినిధి, మార్చి 26,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
ఓర్వకల్లు దగ్గర ఉన్న జయరాజు స్టీల్ ప్లాంట్ నందు అగ్ని ప్రమాదం సంభవించిందని, అదృష్టవశాత్తు మానవ ప్రమాదం ఏమీ జరగలేదని భవిష్యత్తులో ఇటువంటి ప్రమాదాలు జరగకుండా భద్రతా చర్యలు చేపట్టాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.డి. అంజిబాబు ఓర్వకల్లు సిఐటియు మండల కార్యదర్శి శ్రీధర్ కోరారు కార్మిక కర్షక భవన్లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రమా దానికి కారణం యాజమాన్యం తెలియజేస్తూ ఉత్పత్తి క్రమంలో ఇటువంటి ప్రమాదాలు జరగడం సహజమేనని తెలిపిందని కానీ అదృష్టవశాత్తు మానవ ప్రమాదం జరగలేదు కాబట్టి సరిపోయిందని కానీ కార్మికులు గనక ప్రమాదానికి గురి అయ్యుంటే పెద్ద నష్టం జరిగేదని అన్నారు యాజమాన్యం ఇవి అన్ని ఉత్పత్తి క్రమంలో జరిగే సహజ పరిణామాలని కొట్టిపారేయకుండా భవిష్యత్తులో ఇటువంటి ప్రమాదాలు జరగకుండా గట్టి భద్రతా చర్యలు చేపట్టవలసిన అవసరం ఉందని అన్నారు జయరాజ్ స్టీల్ ప్లాంట్ లో జరిగిన ప్రమాదానికి దగ్గరి గ్రామాలైన గుట్టపాడు, కొంతలపాడు, కొట్టాల గ్రామాల ప్రజలు భయబ్రాంతులకు గురి అయ్యారని అన్నారు ఇటువంటి సంఘటనలు జరిగినప్పుడు ప్రజలు ఎప్పుడు ఏమి జరుగుతుందో తెలియక ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బతకవలసి వస్తుందని అటువంటి పరిస్థితులు రాకుండా యాజమాన్యం ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని కోరారు జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమై ఫ్యాక్టరీని సందర్శించి పరిశీలించి తగిన చర్యలు చేపట్టే విధంగా సూచనలు చేయవలసిన అవసరం ఉందని డిమాండ్ చేశారు ఫ్యాక్టరీ యాజమాన్యం కార్మికులకు భద్రత కల్పించాలని వారు కోరారు సమావేశంలో ఓర్వకల్లు మండల సిఐటియు నాయకులు వెంకటేశ్వర్లు రంగస్వామి సూర్యనారాయణ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు

## ఘన వ్యర్థాల నిర్వహణలో సమర్థత పెంచాలి: కమిషనర్ పి.విశ్వనాథ్

### బయో మైనింగ్ పనులకు వేగం - స్వచ్ఛ సర్వేక్షన్ ర్యాంక్ మెరుగుదలకు ప్రత్యేక కార్యాచ








**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 26)**
నగరంలో ఉత్పత్తి అవుతున్న ఘన వ్యర్థాలను శాస్త్రీయ విధానాలతో సమగ్రంగా నిర్వహించాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదేశించారు. గురువారం గార్గేయపురం డంప్‌యార్డును ఆయన పరిశీలించారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ఘన వ్యర్థాల నిర్వహణలో మూల స్థాయిలోనే తడి, పొడి, హానికర చెత్తను వేర్వేరుగా విభజించడం అత్యవసరమని పేర్కొన్నారు. డోర్ టు డోర్ చెత్త సేకరణను మరింత సమర్థవంతంగా అమలు చేసి, సేకరించిన వ్యర్థాలను మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ (ఎంఆర్ఎఫ్) కేంద్రాలకు తరలించి రీసైక్లబుల్, నాన్ రీసైక్లబుల్‌గా వర్గీకరించాలని సూచించారు.తడి చెత్తను విండో కంపోస్టింగ్, వర్మి కంపోస్టింగ్ పద్ధతుల ద్వారా సేంద్రీయ ఎరువులుగా మార్చడం, అజైవిక వ్యర్థాలను రీసైక్లింగ్ యూనిట్లకు పంపించడం చేపట్టాలని తెలిపారు. డంప్‌యార్డులో పేరుకుపోయిన పాత చెత్తను బయో మైనింగ్, బయో రిమిడియేషన్ సాంకేతికతలతో శుద్ధి చేసి, భూమిని తిరిగి వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు.

అదే విధంగా, చెత్త నుండి విద్యుత్ ఉత్పత్తి (వేస్ట్ టు ఎనర్జీ) ప్రాజెక్టును వేగవంతం చేయాలని, 15 ఎకరాల్లో జరుగుతున్న బయో మైనింగ్ పనులను రోజువారీ లక్ష్యాలతో త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. స్వచ్ఛ సర్వేక్షన్ ర్యాంక్ మెరుగుదలకు డేటా నిర్వహణ, డోర్ టు డోర్ కవరేజ్, శానిటేషన్ మానిటరింగ్‌పై ప్రత్యేక ప్రణాళిక అమలు చేయాలని పేర్కొన్నారు.

ఎంఆర్ఎఫ్ ప్లాంట్ మరియు డంప్ యార్డులో జరిగే ప్రతి ప్రక్రియకు లాగ్‌బుక్స్ నిర్వహించాలని, వర్మి కంపోస్టింగ్ ద్వారా ఉత్పత్తి అయ్యే ఎరువుల నిల్వ, పంపిణీ, విక్రయాలపై ప్రత్యేక రిజిస్టర్లు నిర్వహించాలని



ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ యువరాజుకు షోకాజ్ నోటీసు ఇవ్వాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో కార్యదర్శి నాగరాజు, డిఈఈ పవన్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ లోకేష్, స్వచ్ఛ సర్వేక్షన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నవోదయ సీటు సాధించిన విద్యార్థికి అఖిల భారత యాదవ సంఘం ఆధ్వర్యంలో సన్మానం



**మల్లాపూర్ మార్చి 26 (రిపబ్లిక్ న్యూస్)**మల్లాపూర్ మండలంలోని గుండంపల్లి గ్రామానికి చెందిన జక్కుల నవదీప్ యాదవ్ ఇటీవలే వెలువడిన నవోదయ ప్రవేశ పరీక్షలో సీటు సాధించిన సందర్భంగా నవదీప్ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యుల సమక్షంలో అఖిల భారత యాదవ మహాసభ మల్లాపూర్ మండల అధ్యక్షుడు సంగ గంగరాజం, జిల్లా ప్రధాన కార్యదర్శి ధనరేకుల సంతోష్ యాదవ్ మరియు గ్రామ యాదవ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వేల్పుల రాజ గంగారం, తొట్ల మహేందర్, జక్కుల మధు, బుర్రి మల్లేష్, సంపతి హరీష్, బుర్రి సతీష్, సౌకాని శ్రీను, రెబ్బస్ అభి, దానవేణి హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల మ్యాపింగ్‌కు సమిష్టి సహకారం అవసరం

### ప్రతి అర్హుడిని ఓటరుగా నమోదు చేయడమే లక్ష్యం: ఆర్వో పి. విశ్వనాథ్

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 26)**
ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను సమర్థవంతంగా, వేగవంతంగా పూర్తి చేయాలంటే అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సమిష్టిగా సహకరించాల్సిన అవసరం ఉందని కర్నూలు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, నగరపాలక కమిషనర్ పి. విశ్వనాథ్ తెలిపారు. గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల మ్యాపింగ్, కొత్త ఓటర్ల నమోదు తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు.

ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గంలో ఓటర్ల మ్యాపింగ్ కార్యక్రమం చురుకుగా కొనసాగుతోందని పేర్కొన్నారు. ఈ



ప్రక్రియలో ఎదురయ్యే సమస్యలను వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. బిఎల్వోలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను నమోదు చేస్తున్న నేపథ్యంలో బూత్ లెవెల్ ఏజెంట్లు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని కోరారు.

అర్హులైన ప్రతి పౌరుడిని ఓటరుగా నమోదు చేయడం లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలు మరియు విద్యార్థుల్లో ఓటర్ల నమోదు, మ్యాపింగ్‌పై అవగాహన పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

ఈ సమావేశంలో అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, మేనేజర్, తహశీల్దార్ రవికుమార్, డిప్యూటీ తహశీల్దార్ ధనుంజయ, సూపరింటెండెంట్ సుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి దేవస్థానం నందు పూజా కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్ఆర్సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రామభూపాల్ రెడ్డి

**కల్లూరు ప్రతినిధి, మార్చి 26,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
కల్లూరు అర్బన్ : 32వ వార్డు పరిధిలోని “శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి దేవస్థానం ధర్మకర్త చిలుకూరి సత్యవీర ప్రతాప్ ఆహ్వానం మేరకు ఆలయంలో శ్రీ రామ జయ రామ జయ జయ రామ అఖండ భజన మరియు హోమం కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా హాజరై, ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శించుకున్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి ఈ కార్యక్రమంలో స్థానిక 32వ వార్డు మాజీ



కార్పొరేటర్ సాన శ్రీనివాసులు, 28వ వార్డు మాజీ కార్పొరేటర్ నారాయణరెడ్డి, జిల్లా జనరల్ సెక్రెటరీ అక్కిమి హనుమంత రెడ్డి, పందిపాడు ఆదినారాయణ రెడ్డి, ముజఫర్ నగర్ మధుసూదన్ రెడ్డి,దాసరి మోహన్ ,శ్రీను, నాయకంటి సుందరం, మరియు ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# దళిత క్రైస్తవుల పై సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగ విరుద్ధం

## - బిజెపి కుట్రలో భాగమే సుప్రీంకోర్టు తీర్పు. -ఎస్సీ సెల్ కన్వీనర్ శాంతయ్య.

**ఓబులవారిపల్లి మార్చి 26 రిపబ్లిక్ న్యూస్.**

దళిత క్రైస్తవులపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ విరుద్ధమని ఇది దళిత క్రైస్తవులను అవమానించడమేనని మరియు బిజెపి పార్టీ కుట్రలో భాగమేనని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర , కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ నల్ల కదిరిగాళ్ళ శాంతయ్య గురువారం తీవ్రంగా బిజెపిని విమర్శంచ్చారు, ఈ సందర్భంగా శాంతయ్య మాట్లాడుతూ, దళిత క్రైస్తవుల అంశంపై వేలువడిన తాజా సుప్రీంకోర్టు తీర్పును తీవ్రంగా ఖండించారు ఈ తీర్పు పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమని, ముఖ్యంగా భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ ,15, ఆర్టికల్, 25, లను నేరుగా ఉల్లంఘిస్తున్నట్లు పేర్కొన్నారు, ఆర్టికల్ 15 ప్రకారం, మతం, కులం, ఆధారంగా వివక్ష చూపరాదని రాజ్యాంగం స్పష్టంగా చెబుతుంది అలాగే ఆర్టికల్ 25, ప్రకారం ప్రతి మనిషికి తమ మతం, దైవంగా కొలుచుకునే హక్కు రాజ్యాంగం కల్పించింది ఆ హక్కుమతం మారిన మారకపోయినా ఇష్ట దైవాన్ని పూజించుకునే స్వేచ్ఛ ప్రతి భారతీయపౌరునికి రాజ్యాంగం ప్రకారం, (25,28)25, వా నిబంధనలో మరియు ప్రవేశకలో ఆరాధనలో స్వేచ్ఛ అనే పదములో చాలా స్పష్టముగా లిఖించబడి ఉందని,కోర్టులో రాజ్యాంగం స్ఫూర్తిని వదిలి అధికార మత రాజకీయ స్ఫూర్తితో తీర్పులిస్తున్నాయని, ఎస్సీలు మతం మారడం ఉండదు, ఆర్య బ్రాహ్మణ హిందువులు కుట్రపూరితంగా ఆవరణ అశ్వముహులైన, ఎస్సీలను హిందువులుగా ప్రకటించి హిందూ జనాభా సంఖ్యను పెంచాలనే ఉద్దేశంతో ఇలా చేయడం జరిగినదని కానీ వారికి వారితోపాటు సమానత్వం,సామాజిక న్యాయం,స్థాయి, కల్పించలేదని,ఇప్పటికీ ఎస్సీలు కుల వివక్షత, బాదిత,సామాజికవర్గం గా ఎస్సీలు అంటరాని వారిగా ఉన్నారు, ఎస్సీ రిజర్వేషన్ మనుగడ మరియు ఆంధ్రప్రదేశ్ సామాజిక రాజకీయ చదరంగంపై ఒక విశ్లేషణ, భారత రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్ వ్యవస్థ కేవలం ఆర్థిక అభివృద్ధిని ఆశించి చేసినదే కాదు ఇది



దశాబ్దాల తరబడి సామాజిక అనిచివేతకు గురైన వర్గాలకు ప్రభుత్వ నిర్ణయాధికారాలలో, విద్య ఉద్యోగాలలో తగిన ప్రాధాన్యత కల్పించలేదన్నారు, సుప్రీంకోర్టు తీర్పును మారుతున్న రాజకీయ పరిమాణాలు మరియు వివిధ కమిషన్ నివేదికల నేపథ్యంలో, షెడ్యూల్ కులాల రిజర్వేషన్, మనుగడపై అనేక సందేహాలు వ్యక్తం అవుతున్నాయి, ముఖ్యంగా రిజర్వేషన్ విషయంలో వినిపించే క్రిమి లేయర్, అనే అంశాన్ని ఎస్సీ సామాజిక వర్గాలన కు వర్తింప చేయడం అనేది వాస్తవ విరుద్ధమన్నారు, క్షేత్రస్థాయిలో గమనిస్తే, దళిత,కుటుంబాలలో మొదట తరం పొందిన ఉద్యోగాలు మెజారిటీగా చిన్న స్థాయి వే తప్ప, నిర్ణయాధిక రాలు కలిగిన ఉన్నత పదవులు కావు ఆర్టికంగా స్వల్పంగా కుదుటపడినంత మాత్రాన సమాజంలో ఆ వ్యక్తికి ఎదుర్కొనే కుల వికక్ష అంతరించిపోదు, ఆర్థిక అభివృద్ధి అంటే సామాజిక ఎదుగుదల కాదని, ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ రాజకీయ ముఖచిత్రాన్ని గమనిస్తే అది కేవలం పార్టీల మధ్య పోరాటంలో కాకుండా, లోతైన సామాజిక పునాదులను కదిలించి ఒక వ్యూహంగా కనిపిస్తుంది, దళిత క్రైస్తవ వర్గాలే లక్ష్యంగా సాగుతున్న ఈ సామాజిక చదరంగం, లక్షలాదిమంది పేద దళిత, క్రైస్తవ విద్యార్థుల భవిష్యత్తుపై దెబ్బ కొట్టే ప్రయత్నం జరుగుతుంది, రాజ్యాంగం కల్పించిన హక్కులను కేవలం మతంతో ముడి పెట్టడం ద్వారా, దళిత సమాజంలో హిందూ దళిత, మరియు క్రైస్తవ దళిత, అనే విభజన రేఖను గీసి, వారి ఐక్యతను విచ్ఛిన్నం చేయాలని బిజెపి రాజకీయకుట్ర అన్నారు , ప్రవీణ్ పగడాల దళిత పాస్టర్ నాయకుల సిద్ధాంతాలను మనిషి వేసే ప్రయత్నాలు కేవలం రాజకీయ వివాదాలు మాత్రమే కావు, దళిత క్రైస్తవ ఐక్యతను విచ్ఛిన్నం చేయడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ముందుకెళుతున్నదని, దళిత క్రైస్తవ ఓటు బ్యాంకులను అయోమయంగా సృష్టించి, వారి రాజకీయ ప్రాబల్యాన్ని తగ్గించే వ్యూహమే ఇందులో దాగి ఉందని, ప్రభుత్వ పాఠశాలలలో చదువుకునే దళిత, బహుజన బిడ్డలకు అందే కనీస అవసరాలను కూడా వ్యతిరేకించడం వెనుక ఉన్న సాంస్కృతిక అహంకారం, ఆ వర్గాలు ఎప్పటికీ అణగారిన స్థితిలో నే ఉండాలనే భావనను సూచిస్తుంది, ఈ పరిమాణాలన్నిటిని కలిపి చూస్తే తెలుగు రాష్ట్రంలో, దళితులు రాజ్యాధికారం వైపు అడుగులు వేస్తున్న తరుణంలో, వారి వివిధ రూపాలలో అడ్డుకునే ప్రయత్నం జరుగుతుందని స్పష్టమవుతుంది, రాజ్యాంగబద్ధమైన హక్కుల కంటే మతపరమైన గుర్తింపు లకి ప్రాధాన్యం ఇచ్చేలా పరిస్థితులను సృష్టించడం ద్వారా దళిత క్రైస్తవ ఐక్యతను విచ్ఛిన్నం చేయడమే ఈ రాజకీయ క్రీడ,అంతిమ లక్ష్యం కాబట్టి ఆర్థిక స్థితిగతుల కంటే సామాజిక ప్రాతినిధ్యాన్ని ప్రామాణికంగా తీసుకొని, కేంద్ర ప్రభుత్వం, దళితుల రిజర్వేషన్ ఎత్తివేయడానికి బిజెపి ఈ కుట్ర పడిందని ప్రభుత్వం అన్ని మతాలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును నేను తీవ్ర వ్యతిరేకిస్తున్నానని శాంతయ్య తెలిపారు,

# రాజంపేట రైల్వే స్టేషన్లో అమృత్ భారత పనులను పరిశీలించిన, ఆకేపాటి మరియు తల్లెం.



**ఓబులవారిపల్లి మార్చి 26 రిపబ్లిక్ న్యూస్.**

రాజంపేట పట్టణం రైల్వే స్టేషన్ లో అమృత్ భరత్ పనులను గురువారం రాజంపేట వైఎస్ఆర్సిపి శాసనసభ్యులు ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి, మరియు గుంటకల్ డివిజన్ డిఆర్సి సభ్యులు రాయలసీమ వైఎస్ఆర్సిపి బూత్ కమిటీ అధ్యక్షుడు తల్లెం భరత్ కుమార్ రెడ్డి పరిశీలించారు,

ఈ సందర్భంగా శాసనసభ్యులు ఆకేపాటి, గుంతకల్లు డివిజన్ రైల్వే డిఆర్సి సభ్యుడు తల్లెం మాట్లాడుతూ రైల్వే స్టేషన్లో రైల్వే ప్రయాణికుల మరియు రాజంపేట పట్టణ అభివృద్ధిలో భాగంగా ఉండవలసిన సౌకర్యాలు, ప్రయాణికుల అవసరాల కోసం ఏలాంటి సౌకర్యాలు ఉంటే బాగుంటుందో రైల్వే అధికారుల ద్వారా సమాచారం తెల్సుకొని ఆ విధంగా రాజంపేట రైల్వేస్టేషన్లో ఉన్నత సౌకర్యాలు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. రాజంపేట రైల్వేస్టేషన్లో పార్సిల్ ఆఫీస్, రెండు ఎక్సలేటర్ లిఫ్ట్, ప్రయాణికుల సౌకర్యార్థం మరో ఫుటౌట్ బ్రిడ్జి, రెండో నెంబర్ ప్లాట్ఫారంలో టాయిలెట్లు , ప్లాట్ ఫామ్ షెల్టర్,రైల్వే అండర్ బ్రిడ్జి నందు మున్సిపల్ పైప్లైన్ డైవర్షన్ మరియు రైల్వేకు అంతరాయంగా ఉన్న కేబుల్ లను తొలగించి త్వరితగతిన పూర్తయ్యేలా రైల్వే అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా వారు అన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే సీసీ జనార్ధన్, పాపినేని విశ్వనాథరెడ్డి సుబ్బరామరాజు, తిప్పన నాగభూషణం,ఆర్పిఎఫ్ ఎస్సై త్రివేణి, స్టేషన్ మాస్టర్ గోపి, దండు గోపి, కళ్యాణ్ రెడ్డి , అమర్, శివశంకర్, చికెన్ శీను తదితరులు పాల్గొన్నారు.

# అరటి రైతులను ఆదుకుంటాం

## కూడా చైర్మన్ రూపానందరెడ్డి.

**ఓబులవారిపల్లి మార్చి 26 రిపబ్లిక్ న్యూస్.**

రైల్వే కోడూరు నియోజకవర్గంలో గత బుధవారం కురిసిన భారీ వర్షాలకు, వడగండ్లు, బీభత్సంగా వీచిన ఈదురు గాలులకు ఓబులవారిపల్లి మండలంలోని పలు గ్రామాలలో అరటి, తమలపాకు తోటలు విపరీతంగా నేలకొరిగి రైతులకు తీవ్ర నష్టాన్ని, కన్నీరు, ఆవేదనను ప్రకృతి మిగిల్చి రైతుల నడ్డి విరిచింది, సందర్భంగా నష్టపోయిన రైతన్నల కన్నీరు తుడవడానికి వారికి భరోసా ఇవ్వడానికి ఓబులవారిపల్లి, వై కోట గ్రామాలలో గురువారం అరటి, తమలపాకు తోటలను కూడా చైర్మన్ రైల్వే కోడూరు తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ ముక్కా రూపానంద్ రెడ్డి పరిశీలించి అరటి, తమలపాకు తోటల రైతులను ఆదుకుంటామని అధికారులతో చర్చించి నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని వారికి హామీ ఇచ్చారు, వర్షాల వల్ల ఎదురైన ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, రైతులకు తగిన సహాయం అందేలా చర్యలు తీసుకుంటాం

రైతులు ధైర్యంగా ఉండాలని, ప్రభుత్వం వారి పక్షాన నిలుస్తుందని తెలిపారు. అవసరమైన సహాయం త్వరగా అందేలా అధికారులతో సమన్వయం చేసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నేతలు రైతులు కార్యకర్తలు పాల్గొన్నారు.



### ప్రజాదర్బార్ లో సమస్యల పరిష్కారం,

రైల్వే కోడూరు మండలం రాఘవరాజుపురం కడప చెన్నై రహదారి లో ఉన్న తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం ప్రజాదర్బార్ కార్యక్రమం కూడా చైర్మన్ రైల్వే కోడలు తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి ముక్కా రూపానంద రెడ్డి కార్యాలయంలో ఆయన ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగినది, ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని పలువురు అధికారులు పాల్గొనడం జరిగినది అనంతరం నియోజకవర్గంలోని చిట్వేలి పుల్లంపేట పెనగలూరు వారిపల్లి ప్రాంతాల నుండి ప్రజలు సమస్యల వినతులను ఫిర్యాదుల రూపంలో ఆయనకు అందివ్వడం అనంతరం అర్జీలను పరిశీలించిన రూపానంద రెడ్డి అక్కడే ఉన్న ప్రభుత్వ వివిధ శాఖల అధికారులతో చర్చించి పరిష్కారం కాగలిగిన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించడం జరిగినది సమస్యగా ఉన్న వినతులను అధికారులకు చెప్పి వీలైనంత త్వరగా ప్రజల సమస్యలను న్యాయబద్ధంగా ప్రజలకు అనుకూలంగా చేయాలని వారికి సూచించారు ఈ నేపథ్యంలో ఇటీవల కురిసిన వర్షాలకు నష్టపోయిన పండ్ల తోటల రైతులు ఆయనకు వారి గోడు వినిపించుకోగా రైతులు అధైర్య పడవద్దని ప్రభుత్వం, పార్టీ అండగా ఉంటుందని పంట నష్టం అంచనా పూర్తికాగానే





ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని వారికి హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులతో పాటు కూటమి నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

# బుటకపల్లి చెరువు సంబంధిత భూమి

# సుమారు 20 ఎకరాలు కబ్జా

**చౌడేపల్లి ప్రతినిధి మార్చి 26 రిపబ్లిక్ న్యూస్**

అన్నమయ్య జిల్లా, చౌడేపల్లి మండలం దుర్గసముద్రం గ్రామంలో సుమారు నూరు ఎకరాల పైన ఉన్నటువంటి గంగాబుటకపల్లి చెరువులో సుమారు 20 ఎకరముల చెరువును కొంతమంది కబ్జాదారులు దౌర్జన్యంగా ఆక్రమించుకొన్నారని అదే గ్రామానికి చెందినటువంటి కీరమంద మనోహర్ గంగాబుటకపల్లి చెరువుకి సంబంధించి 175 ఎకరాల సాగు చేస్తున్నటువంటి రైతులు కలిసి చౌడేపల్లి మండల తహసిల్దార్ వారికి పలుమార్లు చెరువు కబ్జాకి గురవుతుందంటూ



ఫిర్యాదులు చేసిన చౌడేపల్లి తాసిల్దార్ ఎటువంటి చట్టపరమైన చర్యలు తీసుకోకపోగా కీరమంద మనోహర్ ఉన్నతాధికారులైనటువంటి జిల్లా అధికారులకి ప్రభుత్వం చేపట్టినటువంటి ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పిజిఆర్ఎస్) లో ఫిర్యాదు చేయడం జరిగింది జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసిన ఫలితం శూన్యము అని వాపోయాడు మండల అధికారులు న్యాయం చేయలేదంటూ జిల్లా అధికారులకు పలుమార్లు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగిన అధికారులు ప్రజల సమస్యలను పట్టించుకునే పరిస్థితిలో లేరంటూ రైతులు వారి బాధను ఎవరికి చెప్పుకోవాలో తెలియదంటూ అక్రమాలను దౌర్జన్యాలను అరికట్టాల్సిన అధికారులే అన్యాయం చేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు చంద్రబాబు నాయుడు గారు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారు ప్రభుత్వ అధికారుల తీరుపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారని వేడుకుంటున్నాము. ప్రభుత్వం చేపట్టినటువంటి ప్రజా సమస్యల పరిష్కార వేదిక పేరుకు మాత్రమే వేదికగా వ్యవహరిస్తుందంటూ సమస్యల పరిష్కారంలో పరిస్కారం మాత్రం ఉండదంటున్నారు.

### హుండీ లెక్కింపు ద్వారా అమ్మవారికి రూ.35.33 లక్షలు ఆదాయం




**చౌడేపల్లి ప్రతినిధి మార్చి 26 రిపబ్లిక్ న్యూస్** శక్తి క్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయంలో అమ్మవారికి హుండీ లెక్కింపు ద్వారా రూ 35.33.848లు ఆదాయంగా సమకూర్నట్లు ఈవో ఉప కమిషనర్ ఏకాంబరం తెలిపారు కొండపై 31 రోజులకు గాను నిర్వహించిన లెక్కింపులో నగదు తో పాటు 10 గ్రాముల బంగారం 136 గ్రాముల వెండి విరేసి కరెన్సీ అమ్మవారికి కానుకలుగా వేసినట్లు ఆయన వివరించారు అన్నదానము పొందగల హుండీ ద్వారా రూ 12.444లు రణభేరి గంగమ్మ ఆలయంలో ఉంచిన హుండి ద్వారా రూ 22.655లు ఆదాయంగా సమకూరిందన్నారు ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ ఇన్స్పెక్టర్ శశి కుమార్ ఆలయ అధికార అర్చక సేవక్ సిబ్బంది పాల్గొన్నారు

# ఎపిలో పెరుగుతున్న ఎండలు

## పలు జిల్లాల్లో వడ గాలులు వీచే ప్రమాదం

**అమరావతి,మార్చి , 26,( రిపబ్లిక్ న్యూస్)**



దేశ వ్యాప్తంగా ఎండలు దంచి కొడుతున్నాయి. పలు రాష్ట్రాల్లో 40 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. ఇక, ఆంధప్రదేశ్‌లోనూ రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతూ పోతున్నాయి. మధ్యాహ్నం వేళల్లో వడగాడ్పులు వీస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఏపీ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ప్రజలకు హెచ్చరికలు జారీ చేసింది. రాష్ట్రంలో రెండు రోజుల పాటు వడగాడ్పులు వీస్తాయని తెలిపింది. శుక్రవారంపార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాలు, పోలవరం జిల్లా చింతూరు..కూనవరం, వరరామచంద్రాపురం, కాకినాడ జిల్లా జగ్గంపేట, తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ, ఎన్టీఆర్ జిల్లా జీ.కొండూరు, ఇబ్రహీంపట్నం మండలాల్లో తీవ్ర వడగాల్పులు (09) ప్రభావం చూపే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. శుక్రవారం విజయనగరం జిల్లాలో 4 మండలాలు, పార్వతీపురం మన్యం జిల్లాలో 3 మండలాలు, పోలవరం జిల్లాలోని 3 మండలాలు, కాకినాడ జిల్లాలో ఒక మండలం, తూర్పుగోదావరిలో 2 మండలాలు, ఏలూరులో 4 మండలాలు, కృష్ణాలో 2 మండలాలు, ఎన్టీఆర్‌లో 7 మండలాలు, గుంటూరులో ఒక మండలం, పల్నాడు జిల్లాలోని 5 మండలాల్లో వడగాడ్పుల ప్రభావం ఉంటుందని వెల్లడించారు. నివారం 90 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందన్నారు. నేడు కడప జిల్లాలోని కమలాపురంలో 40.7 డిగ్రీలు.. అనంతపురం జిల్లాలోని తెరన్నపల్లిలో 40.6 డిగ్రీలు, కృష్ణా జిల్లాలోని పెద్దపారుపూడిలో 40.5 డిగ్రీలు, నంద్యాల జిల్లాలోని కొత్తపల్లెలో 40.4 డిగ్రీలు, కర్నూలు జిల్లాలోని బస్తిపాడులో 40.3 డిగ్రీల చొప్పున అధిక ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వెల్లడించారు. ప్రజలు ఎండదెబ్బ తగలకుండా టోపీ, గొడుగు, టవల్, కాటన్ దుస్తులు ఉపయోగించాలని సూచించారు. వృద్ధులు, గర్భిణీలు, బాలింతలు తగిన జాగ్రత్తలు తీసుకుని అప్రమత్తంగా ఉండాలన్నారు. చెవుల్లోకి వేడి గాలి వెళ్లకుండా జాగ్రత్త పడాలని హెచ్చరించారు.

## అంచలంచలు ఎదుగుతున్న

# పూల మల్లేశం



**హత్నూర :26 మార్చ్ 26 ( రిపబ్లిక్ న్యూస్)**

సిరిపురం గ్రామంలో అంచలంచలేదుగుతున్న యూత్ అధ్యక్షులు పూల మహేష్ (అలియాస్ మల్లేశం ) శ్రీరామనవమి కళ్యాణ మహోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ సిరిపురం గ్రామంలో చిన్నల్లు, పెద్దలు, వృద్ధులు ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలని పంట పొలాలు కూడా మంచిగా పండి అందరు లాభాలలో కొనసాగాలని ఆ దేవుని ప్రార్థిస్తున్నాను. రేపు జరగబోయే శ్రీరామ నవమి కళ్యాణ మహోత్సవ కార్యక్రమానికి గ్రామ ప్రజలు అందరు పాల్గొని విజయవంతం చేయగలరని నా యొక్క మనవి,.ఇట్లు మీ మహేష్

# సమగ్ర యాజమాన్య పద్ధతులతో పంటల దిగుబడి

## : గువ్వల రమేష్ రెడ్డి



**చౌడేపల్లి ప్రతినిధి మార్చి 26 రిపబ్లిక్ న్యూస్** మామిడి సాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటిస్తే పంటల దిగుబడి అధికంగా వస్తుందని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గువ్వల రమేష్ రెడ్డి అన్నారు గురువారం స్థానిక మండల పరిపాలన భవన సముదాయంలో ఉద్యానవన శాఖ నుంచి మంజూరైన మామిడి కవర్లను ఆయన పంపిణీ చేశారు ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం అనేక పథకాలు రూపొందించి అమలు చేస్తుందన్నారు. రైతులందరూ సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం ఉద్యానవన శాఖ తరపున మంజూరు అవుతున్న సంక్షేమ పథకాలు వంటివి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లీలావతి, ఉద్యానవన శాఖ అధికారి సంతోషి కుమారి, తెలుగుదేశం పార్టీ నాయకులు పూల చంద్రమౌళి బోయకొండ సుబ్బు ,విజయ భాస్కర్ రెడ్డి, హమీద్ భాషా, ముని వెంకటప్ప ,చంగల్ నాయుడు, సోము ,రాధాకృష్ణ ,కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు.

# పవన్ కల్యాణ్‌ను కలిసిన యంగ్ బైకర్ తాప్సీ ఉపాధ్యాయ...





**అమరావతి,మార్చి , 26,( రిపబ్లిక్ న్యూస్)**

దేశవ్యాప్తంగా ప్రజారోగ్యంపై అవగాహన కల్పించే లక్ష్యంతో ఒంటరిగా బైక్‌పై యాత్ర చేస్తున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన యువతి తాప్సీ ఉపాధ్యాయను ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అభినందించారు. "ఒబేసిటీ ముక్త్ భారత్ – మిషన్ హెల్తీ భారత్" యాత్రలో భాగంగా ఆమె గురువారం మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో పవన్ కల్యాణ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తన యాత్ర వివరాలను తాప్సీ పవన్‌కు వివరించారు. ఆరోగ్యంపై ప్రజల్లో చైతన్యం నింపేందుకు మార్చి 9న మీరట్‌లో ఈ సోలో బైక్ యాత్ర ప్రారంభించినట్లు తెలిపారు. బుల్లెట్‌పై ఒంటరిగా ప్రయాణిస్తూ ఇప్పటివరకు సుమారు 17,400 కిలోమీటర్లు పూర్తి చేశానని, 16 రాష్ట్రాల్లోని 500కు పైగా విద్యాసంస్థల్లో అవగాహన సదస్సులు నిర్వహించానని చెప్పారు. మిగిలిన 12 రాష్ట్రాల్లో కూడా తన యాత్రను కొనసాగిస్తానని ఆమె పేర్కొన్నారు.

తాప్సీ ఉపాధ్యాయ సాహసోపేతమైన సంకల్పాన్ని పవన్ కల్యాణ్ ప్రశంసించారు. ఈ సందర్భంగా ఆమెను సత్కరించి, యాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు. దేశ ప్రజల ఆరోగ్యం కోసం ఆమె చేస్తున్న కృషి ఎంతో మంది యువతకు స్ఫూర్తిగా నిలవాలని ఆయన అభిలషించారు. 23 ఏళ్ల తాప్సీ చేపట్టిన ఈ మిషన్ గొప్పదని కొనియాడారు.

## సీఎంపై వ్యాఖ్యలు: జోగి రమేశ్‌కు పోలీసుల నోటీసులు

**అమరావతి,మార్చి , 26,( రిపబ్లిక్ న్యూస్)**

వైసీపీ నేత, మాజీ మంత్రి జోగి రమేశ్‌కు పోలీసులు నోటీసులు జారీ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలతో బాపట్ల జిల్లా భట్టిప్రోలు పోలీస్ స్టేషన్‌లో పోలీసులు కేసు నమోదు చేయడం తెలిసిందే. ఈ మేరకు ఆయనకు నోటీసులు జారీ చేసి, వారం రోజుల్లోగా విచారణకు హాజరు కావాలని ఆదేశించారు.

వివరాల్లోకి వెళితే, ఫిబ్రవరి 2వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబును ఉద్దేశించి జోగి రమేశ్ చేసిన వ్యాఖ్యలపై ఈ కేసు నమోదైంది. ఈ ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసిన భట్టిప్రోలు పోలీసులు, తాజాగా విచారణ ప్రక్రియను వేగవంతం చేశారు. ఇందులో భాగంగానే ఆయనకు నోటీసులు పంపారు.కాగా, జోగి రమేశ్‌పై గత నెలలో కూడా మరో కేసు నమోదైన సంగతి తెలిసిందే. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో అనుమతి లేకుండా ర్యాలీ నిర్వహించడం, జన సమూహాన్ని ప్రోత్సహించడం వంటి ఆరోపణలపై సెక్షన్ 30 యాక్ట్ కింద ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేశారు.

# జిల్లా జైలు, మహిళా జైలు ఆకస్మిక తనిఖీ చేసిన న్యాయమూర్తి

**ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం హామీ ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్ సేవలపై అవగాహన, ఆహారం-ఆరోగ్య సదుపాయాలపై సమీక్ష**








**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 26)**

జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి ఈ రోజు పురుషుల జిల్లా కారాగారం మరియు మహిళా కారాగారాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా జడ్జి జైలులోని ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్ ను పరిశీలించి, ఖైదీలకు అందించే న్యాయ సహాయంపై వివరించారు. ప్రతి క్లినిక్‌లో ఒక అడ్వకేట్ మరియు ఒక ప్యారా లీగల్ వాలంటీర్ ఉంటారని, వారు ఖైదీలకు ఉచిత న్యాయ సేవలు అందిస్తారని తెలిపారు.

జడ్జి ఖైదీలను ఉద్దేశించి మాట్లాడుతూ,సత్ప్రవర్తనతో శిక్షను పూర్తి చేయాలని సూచించారున్యాయవాదులు లేని ఖైదీలకు ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామని తెలిపారు70 ఏళ్ల పైబడిన వారు మరియు అనారోగ్యంతో బాధపడుతున్న ఖైదీలకు ప్రత్యేకంగా ఉచిత న్యాయ సహాయం అందించి, త్వరగా బెయిల్ మంజూరు అయ్యేలా కృషి చేస్తామని చెప్పారుఅదేవిధంగా, జైలులో ఖైదీలకు అందిస్తున్న ఆహారం, రేషన్ మరియు ఆరోగ్య పరిరక్షణ చర్యలను కూడా సమీక్షించారు.ఖైదీలను కోర్టు వాయిదాలకు కచ్చితంగా హాజరు కావాలని ఆదేశించిన జడ్జి ఏవైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ, కర్నూలును సంప్రదించవచ్చని సూచించారు. ఈ సందర్భంగా లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నెంబర్ 15100 పై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో జైలు అధికారులు, అసిస్టెంట్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ సులోచన మరియు ఖైదీలు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమ ధ్యేయంగా తెలుగుదేశం పార్టీ





**చిప్పగిరి, మార్చి , 26,( రిపబ్లిక్ న్యూస్)**

పేదల సంక్షేమ దేంగా తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలుగుదేశం పార్టీ ఆలూరు నియోజకవర్గం ఇంచార్జ్ వైకుంఠం జ్యోతి అన్నారు, గురువారం ఆలూరు ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నందు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు, అనారోగ్యంతో ఇబ్బంది పడే ఆర్థిక సాయం ఎదురుచూస్తున్న పలువురు లబ్ధిదారులకు వైకుంఠం జ్యోతి చేతుల మీదుగా చెక్కులు అందజేశారు, వైకుంఠం జ్యోతి మాట్లాడుతూ 6 మండలాలకు 176 మంది లబ్ధిదారులకు 61,27,764 సీఎం రిలీఫ్ ఫండ్ వచ్చాయని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు ప్రత్యేక ధన్యవాదాలు అని తెలిపారు, మా పార్టీ లక్ష్యం ప్రజా సంక్షేమమని, మా మార్గం నిరంతర సేవా అని తెలిపారు, అనంతరం చిప్పగిరి మండల సొసైటీ చైర్మన్ కొండ రామాంజనేయులు, మండల కన్వీనర్ పురుషోత్తం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ చిప్పగిరి మండలంలో 14 మంది లబ్ధిదారులకు 7,55,170 రూపాయలు చెక్కులు పంపిణీ చేశామని తెలిపారు, లబ్ధిదారులు వైకుంఠం జ్యోతి, వైకుంఠం శివప్రసాద్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు, ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి మీనాక్షి నాయుడు, మాజీ మండల కన్వీనర్ వలి ,చిప్పగిరి సర్పంచ్ దాసరి గోవిందరాజులు, రామదుర్గం తిమ్మయ్య, వైకుంఠం వెంకటేశ్వర్లు, రామదుర్గం రామచంద్ర, భోగేశ్ స్వామి,జనార్దన్ స్వామి తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ప్రమాదం తెలిసి నిర్లక్ష్యం




### విద్యుత్ అధికారుల తప్పిదం
### విపత్తులకు విద్యుత్ సంభవించే ప్రమాదం
### రహదారుల ప్రక్కనే ట్రాన్స్ఫార్మర్లు ఉన్న వైనం
### బహిరంగ ప్రదేశాల్లో కంచె వేయని దృశ్యం



**రిపబ్లిక్ క్రైమ్, మార్చి 26, అనంతపురం**

ప్రధాన విద్యుత్ కార్యాలయం డి-1 సెక్షన్ పరిధిలోని విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లు ప్రజల ప్రాణాలకు ముప్పుగా ఉండి స్థానికుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ఇలా బహిరంగ ప్రదేశాలలో ఇనుప విద్యుత్ స్తంభాలతో ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేయడంతో వాటి చుట్టూ కంచ లేక ప్రజల ప్రాణాలు పోతున్నాయి. ఇలా కంచె లేని విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లు నగరంలో అధిక సంఖ్యలో ఉన్నాయి. పర్యవేక్షించాల్సిన విద్యుత్ ఏఈ అధికారులు ఏం మాత్రం పట్టించుకున్న పాపాన పోలేదు. వీరిపై ఏడి అధికారులు మాత్రం చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో విద్యుత్ ప్రమాదాలకు గురై ప్రజలు ప్రాణాలు కోల్పోయే పరిస్థితి నెలకొంది. ఏకంగా నగరం నడిబొడ్డున ట్రాన్స్ఫార్మర్ కంచె లేకుండా ఎన్నో ఏళ్లుగా అలాగే వదిలేసి ఉన్నారు. ఇలా కంచలేని ట్రాన్స్ఫార్మర్లు నగరంలో అధిక సంఖ్యలో ఉన్నాయని చెప్పవచ్చు. అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రజల ప్రాణాలు పోతున్న పై స్థాయి అధికారులు ఏమాత్రం పట్టించుకున్న సందర్భాలు లేవనే చెప్పవచ్చు.

పర్యవేక్షించాల్సిన అధికారులు నగరంలో ఉన్నట్టా.. లేనట్టా.. ఇంత బహిరంగ ప్రదేశాలలో మరీ జనం రద్దీగా ఉన్న ప్రాంతంలో ఇంత నిర్లక్ష్యంగా కంచె వేయకుండా ఉండడం తగునా.. ప్రాణాలు పోతున్నా .. ప్రమాదం ఉంది అని తెలిసి కూడా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. వీరి నిర్లక్ష్యం వల్ల ప్రాణాలు పోవడమే కాక కుటుంబంలోని వ్యక్తులను కోల్పోయి కోలుకోలేని కుటుంబాల ఎన్నో రోడ్డును పడ్డాయి. అధికారులు మాత్రం తమకు ఏమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. చనిపోయిన కుటుంబాలకు విద్యుత్ శాఖ ఆసరా కల్పించిన దాఖలాలు ఏమాత్రం లేవనే చెప్పవచ్చు.


### ట్రాఫిక్ రద్దీలో వాహనాలు ఆగినప్పుడు ప్రమాదం

అనంతపురం నగరంలో శ్రీకంఠం సర్కిల్ లో ఖాది బాండర్ ముందు ఇనుప విద్యుత్ స్తంభాలపై ట్రాన్స్ఫార్మర్ బిగించి కంచె వేయకుండా వదిలేశారు.ఆ సర్కిల్ ప్రధాన రహదారిలో తరచూ అనేకమంది పాదచారులు, ద్విచక్రనదారులు అధిక సంఖ్యలో ప్రయాణం చేస్తుంటారు. ట్రాఫిక్ రద్దీగా ఉన్న సమయంలో ప్రజలు గమనించకుండా వెళ్లేటప్పుడు ప్రమాదవశత్తు ఏదైనా జరిగితే ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. అంతేకాకుండా ట్రాఫిక్ రద్దీగా ఉన్న సమయంలో వాహనాలు ఆగినప్పుడు , ద్విచక్ర వాహనదారులు, ఆటోల ప్రయాణికులు ప్రమాదవశత్తు ఇనుప విద్యుత్ స్తంభాలకు తగిలినప్పుడు ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంది. అందులో భాగంగాజిల్లా అధికారులు కూడా నగరంలో ప్రయాణం చేస్తున్నప్పటికీ పట్టించుకున్న దాఖలాలు లేవు. అంతేకాక ట్రాఫిక్ రద్దీలో బస్సులు ఆగినప్పుడు పిల్లలు ఎవరైనా తెలియక ప్రమాదవశాత్తు కిటికీలలోనుంచి చేతులు బయటికి చాచితే ట్రాన్స్ఫార్మర్ తీగలు తగిలితే...

వారు ప్రాణాలు కోల్పోవడమే కాక బస్సు మొత్తానికి విద్యుత్ సంభవించి బస్సులోని ప్రయాణికులు మొత్తం చనిపోయే ప్రమాదాలు పొంచి ఉన్నాయి.దీనివల్ల ఎన్నో కుటుంబాల ఆప్తులను కోల్పోయే ప్రమాదం ఉంది. ఇలాంటి అధికారులు ఉన్నంతవరకు ప్రజల ప్రాణాలు పోతూనే ఉంటాయి. వీరి నిర్లక్ష్యం వల్ల ప్రజల ప్రాణాలు కోల్పోయి వీధిన పడుతున్న కుటుంబాలు ఎన్నో..

### కంచె వేయకుండా విద్యుత్ అధికారులు నిర్లక్ష్యం

చాలా వరకు తక్కువ ఎత్తులో సెక్షన్ బోర్డులు, సిట్టింగ్ మీటర్లను బిగించారు. అర్తు వైర్లకు కంచె వేయకుండా విద్యుత్ అధికారులు నిర్లక్ష్యంగా వదిలేశారు. ప్రతి ట్రాన్స్ఫార్మర్ చుట్టూ కంచె తప్పనిసరిగా ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ ఏమాత్రం పట్టించుకోకుండా ఎట్టకేలకు బహిరంగంగా వదిలేసి చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. వీరి తప్పిదాలకు మనుషులతో పాటు మూగజీవులకు ప్రమాదాలు వాటిల్లే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. నగరంలో 160 కె.వి ట్రాన్స్ఫార్మర్ ల చుట్టు కచ్చితంగా కొంచె వేయాల్సి ఉంది. కంచె వేయకుండా జరిగే ప్రమాదాలలో ఎవరైనా చనిపోతే అధికారులు బాధ్యత వహిస్తారా అన్నది ప్రశ్నార్థకంగానే మిగిలింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ అధికారులు నిర్లక్ష్యంగా మాట దాటవేస్తారు. దీంతో ప్రాణ నష్టం కోల్పోయి రోడ్డున పడుతున్న కుటుంబాలు ఎన్నో. కానీ ప్రమాదాలకు గురై చనిపోయిన కుటుంబాలకు విద్యుత్ శాఖ ఆర్థిక భరోసా ఏ మాత్రం కల్పించిన దాఖలాలు లేవు. కంచె లేని ట్రాన్స్ఫార్మర్లు నగరంలో ఎన్నో ఉన్నాయి కానీ వాటి అన్నిటికి కూడా కంచె వేసి విద్యుత్ అధికారులు సంరక్షించాల్సిన అవసరం ఉంది.



### ధనార్జనే ధ్యేయంగా విద్యుత్ అధికారులు

విద్యుత్ కార్యాలయాలలో ధనార్జనే ధ్యేయంగా కొందరు విద్యుత్ అధికారులు పని గట్టుకొని పనిచేస్తున్నారు. నాలుగు ఫోళ్లు వేసి ట్రాన్స్ఫార్మర్ లను బిగించాల్సిన అధికారులే.. కేవలం రెండంటే రెండు ఫోళ్లు వేసి, వాటికి అడ్డంగా బిగించాల్సిన నాలుగు ఆంగ్లేయర్ లు బిగించకుండా.. వీటికి బదులుగా... రెండు ఫోళ్లు.. రెండు ఆంగ్లేయర్ లు వేసి.. వీటికి దొంగ లెక్కలు రాసి అధికంగా దోచుకు తింటున్నారు. విద్యుత్ శాఖలో ఇలా దొంగ బిల్లులు పెట్టి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న అధికారులు ఎందరో విద్యుత్ కార్యాలయాలలో ఉన్నారనే చెప్పవచ్చు. ఇలా వ్యక్తిగత ఆదాయంలో మునిగి తేలుతున్న అధికారులు ఎందరో ఉన్నారు. ఇలా విధులలో అలసత్వం వహించి వ్యక్తిగత ఆదాయానికి మొగ్గు చూపుతూ బయటపడని బాసులెందరో.. ఉన్నారు. ఇలా బయటపడకుండా వ్యక్తిగతంగా దోచుకు తింటున్న అధికారులు ఎందరో నగరంలో ఉన్నారు అంటూ బహిరంగంగానే చర్చ సాగుతోంది.

### రహదారులలో విద్యుత్ ఫోళ్ళు ఉండకూడదు

**రెండు ఇనుప విద్యుత్ ఫోల్ల మధ్య రెండు సైడ్ ఇనుప ఆంగ్లేరులను వేసి ట్రాన్స్ఫార్మర్లు బిగించారు. అయితే ఒక్కో ట్రాన్స్ఫార్మర్ పరిధిలో ఒక సెక్షన్ బోర్డు ప్రమాదంగా ఉంది. ట్రాన్స్ఫార్మర్ సెక్షన్ బోర్డుకు విద్యుత్ వచ్చిన అనంతరం తిరిగి సిట్టింగ్ మీటర్ నుంచి నగరాని అందజేసే విద్యుత్ బోర్డ్ లు ఏమాత్రం కంచె లేకుండా ఉన్నాయి. అందులోనూ ప్రధాన రహదారులలో ఇనుప విద్యుత్ ఫోళ్ళు ఉండకూడదు. ఇవి తెలిసినప్పటికీ అధికారులు మాత్రం తమకు ఏమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇనుప విద్యుత్ స్తంభాలు ఏళ్ల తరబడి రోడ్లపైనే ఉన్నాయి.తొలగించాల్సిన అధికారులు మాత్రం విధినిర్వహణలో అలసత్వం వహిస్తున్నారు. దీంతో వీరి నిర్లక్ష్యం వల్ల వర్షాకాలంలోనే ఎక్కువగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ముందస్తు చర్యలలో భాగంగా అధికారులు మొత్తం మేల్కోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు వాటి వల్ల ప్రమాదవశాత్తు విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ నుంచి ప్రమాదం సంభవిస్తే ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. అయితే విద్యుత్ కార్యాలయాల ఏఈ అధికారులు వీరి పై ఉన్నతాధికారులు ఏడిలు పర్యవేక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.ఇప్పటికైనా నగరంలో వివిధ ప్రాంతాలలో విద్యుత్ కార్యాలయ అధికారులు పర్యవేక్షించి అవసరమైన, అత్యవసర ప్రదేశాలలో విద్యుత్ ఇనుప స్తంభాలను తొలగించి సిమెంట్ ఫోళ్లను వేసి ప్రమాదాలు జరగకుండా నివారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.**

# ట్రంప్ మూర్ఖానికి ప్రపంచదేశాలు మూల్యం !

**మార్చి , 26,( రిపబ్లిక్ న్యూస్)**

అమెరికా, ఇజ్రాయిల్ దేశాలు ఈ సంవత్సరపు అతిపెద్ద విలన్లుగా ప్రపంచంలో అవతరించారు. తమ యుద్ధ దాహానికి ప్రపంచాన్ని బలి తీసుకున్నారు. ఆయుధ సంపత్తి ఉందికదా అని ఇరాన్‌పై విచ్చలవిగిగా జరిపిన బాంబు దాడిలో ఇప్పటికే ఇరాన్ బాగా దెబ్బతింది. ఇరాన్ దాడుల్లో గల్ఫ్ దేశాలు కూడా దెబ్బిన్నాయి. ఈ క్రమంలో ఏం సాధించారో ట్రంప్ ప్రపంచానికి చెప్పాలి. గతంలో ఇరాక్‌లో ఇలాంటి దడి చేసి సద్దాం హెస్సేన్‌ను ఉరేశారు. ఇక్కడ ఖమేనీని చంపేశారు. వీరి యుద్ధాలు ప్రపంచానికి సంకటంగా మారాయి. ట్రంప్ తీరుతో ప్రపంచం కొరివితో తలగోక్కున్నట్లుగా తయారయ్యింది. ఇరాన్‌ను లొంగదీసుకుంటానని ప్రగల్భాలు పలికిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. క్రమంగా వెనక్కి జారుకున్నారు. చర్చలు జరుగుతు న్నాయని, ఐదు రోజులపాటు యుద్ధానికి విరామం ఇస్తున్నామని ప్రకటించారు. అయితే, ఇరాన్ మాత్రం.. యుద్ధం మొదలైనప్పటి నుంచీ ఇప్పటి వరకూ.. తమకూ అమెరికాకు మధ్య ఎటువంటి చర్చలు జరగలేదని, తాము చర్చలకు సిద్ధంగా లేమని స్పష్టం చేసింది. మీరు దాడులు మొదలు పెట్టి మీరే షరతులు పెడతారా అని నిలదీసింది. మేమూ షరతలు పెడతామని చెప్పింది. మొత్తమ్మీద, ట్రంప్ మాటలకు విశ్వసనీయత లేద ని, రోజుకో మాట మాట్లాడటమే ఆయన తీరని మరోసారి రుజువైంది. ఏదేమైనా.. ట్రంప్ వెనక్కి తగ్గటం మాత్రం కాదనలేని వాస్తవం. ట్రంప్ తీరుపై స్వదేశంలోనూ తీవ్ర వ్యతిరేకత వస్తోంది. ఇజ్రాయిల్ కోల్పోయిందేమీ లేదు క ఆనీ, అమెరికా భారీగా నష్టాన్ని మూటగట్టుకుంది. ఓ రకంగా చెప్పాలంటే యుద్ధంలో ఇరాన్ గెలిచిందనే చెప్పాలి. ఇరాన్ మీద కయ్యానికి కాలు దువ్వినప్పుడు అమెరికా–ఇజ్రాయెల్ లకు ఓ స్పష్టమైన లక్ష్యం లేదు. ఖమేనీ సారథ్యంలోని ప్రభుత్వాన్ని పడగొడతామని ఒకసారి, ఇరాన్ అణ్వాయుధాలను తయారు చేయకుండా చూడటం అని మరోసారి, ఇరాన్ నుంచి అమెరికాకు ముప్పు పొంచి ఉందని, ఆ దేశాన్ని లొంగదీసుకుంటామని ఇంకోసారి.. ఇలా పూటకో మాట చెప్పారు ట్రంప్. మరోవైపు, తమ మీద రుద్దిన ఈ యుద్ధాన్ని ఎదుర్కొని తమ దేశ సమగ్రతను కాపాడుకునే ఏకైక, స్పష్టమైన లక్ష్యంతో ఇరాన్ యుద్ధంలోకి దిగింది. అంతులేని యుద్ధాలకు ముగింపు పలుకుతానని, అమెరికాను మళ్లీ గొప్ప దేశంగా మారుస్తానంటూ రెండోసారి అధికారంలోకి వచ్చిన ట్రంప్.. అమెరికాకు ఏ విధంగానూ అవసరం లేని యుద్ధం చేస్తున్నారన్న భావన అమెరికన్లలో వ్యాపించింది. తాము కట్టిన పన్నుల్ని నెతన్యాహూ కోసం ఎందుకు ఖర్చు చేస్తున్నారని వారు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు, అమెరికాలో పెట్రోల్, డీజిల్ ధరలు ఇటీవలి కాలంలో ఎన్నడూ లేనంత పెరిగాయి. స్థిరచిత్తం



లేని ట్రంప్ మాటలతో, చేతలతో అమెరికా అధ్యక్ష పదవి ఓ జోకులాగా తయారైంది. స్వయంగా ట్రంప్ మద్దతుదారులు కూడా ఈ యుద్ధాన్ని సమర్థించటం లేదు. సర్వేల్లో ట్రంప్ ప్రజాదరణ రోజురోజుకీ దిగజారుతోంది. మరోవైపు, ఈ ఏడాది చివర్లో అమెరికా ప్రతినిధుల సభకు ఎన్నికలు జరగనున్నాయి. అధికారపక్షమైన రిపబ్లికన్ పార్టీకి పరిస్థితులు ఏమాత్రం సానుకూలంగా లేవన్న సంకేతాలు వెలువడుతున్నాయి. ఈ నేపథ్యంలోనే, తాజాగా వెనక్కి తగ్గారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వెనెజువెలాలో అధ్యక్షుడు మదురో అధికారిక నివాసంపై దాడి చేసి రాత్రికి రాత్రి కిడ్నాప్ చేసి అమెరికాకు తీసుకొచ్చిన ట్రంప్.. ఇరాన్ మీద కూడా అదే ఎ÷–లాన్ అమలు చేయాలని భావించారు. ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ రాజధాని టెహ్రాన్‌లో సైనిక, పౌర ఉన్నతాధికారులతో సమావేశమైన తరుణంలో వారి మీద అమెరికా, ఇజ్రాయెల్ అకస్మాత్తుగా బాంబులు కురిపించాయి. వారిని హత్య చేసి యుద్ధం ప్రారంభించాయి. ఖమేనీ హత్య తర్వాత.. అప్పటి వరకూ ఉన్న అంతర్గత విభేదాలు, ప్రభుత్వం మీద ఉన్న అసమ్మతిని కూడా పక్కనపెట్టి.. దేశ పరిరక్షణకు యావత్ ఇరాన్ ఒక్కటైంది. ఆ దేశంలోని ప్రతీ పట్టణంలో.. ఓవైపు క్షిపణులు, బాంబులు పడుతున్నా కూడా బెదరకుండా.. రోడ్ల మీదికి పెద్ద సంఖ్యలో వచ్చి ప్రభుత్వానికి మద్దతు ప్రకటిస్తూ ర్యాలీలు జరిపారు. ఇప్పటికీ ఇవి కొనసాగుతున్నాయి. ఇరాన్ బలాబలాలేమిటి అన్నది సమగ్రంగా సమీక్షించకుండానే ట్రంప్ ఈ యుద్ధంలోకి దిగారు. అమెరికా సైన్యాధికారులతో సంప్రదించలేదు. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు నేతృత్వంలోని శక్తిమంతమైన యూదు లాబీ మాటలువిని ట్రంప్ యుద్ధం నిర్ణయం తీసుకున్నారని స్వయంగా అమెరికా ఉగ్రవాద నిరోధక విభాగం డైరెక్టర్ జో కెంట్ వెల్లడించి నిరసనగా పదవికి రాజీనామా చేశారు. గల్ఫ్ మొత్తానికి యుద్ధాన్ని విస్తరిస్తుందని ట్రంప్, నెతన్యాహు ఊహించి ఉండరు. ఇక హార్మూజ్ జలసంధిని అడ్డుకోవటం ద్వారా ఇరాన్ తన వద్ద ఉన్న బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించింది. దీంతో యుద్ధం ప్రభావం యావత్ ప్రపంచం మీద పడింది. దీనికి ట్రంప్ దూకుడే కారణం. ప్రపంచం యావత్తూ గ్యాస్, ఇంధనాల కొరతతో అల్లుడుతోంది. ఆయా దేవాల ఆర్థిక స్థితి దారుణంగా పడిపోయింది. ఇప్పట్లో ఈ నష్టాల నుంచి కోలుకోవడం ఎవరికైనా కష్టమే.

# మోత ప్రారంభం..

## పెట్రోల్, డీజిల్ ధరలను పెంచిన నయారా

**మార్చి , 26,( రిపబ్లిక్ న్యూస్)**




పశ్చిమాసియా యుద్ధం వల్ల అంతర్జాతీయంగా క్రూడాయిల్ సరఫరాకు ఆటంకాలు ఏర్పడుతున్న తరుణంలో, దేశీయంగా ఇంధన ధరల సెగ మొదలైంది. ముఖ్యంగా ప్రైవేట్ చమురు దిగ్గజం నయారా ఎనర్జీ తీసుకున్న నిర్ణయం ఇప్పుడు వాహనదారులకు పెద్ద షాక్ ఇచ్చింది. రష్యాకు చెందిన 'రాస్‌నెఫ్ట్' భాగస్వామ్యం ఉన్న ఈ సంస్థ... పెట్రోల్, డీజిల్ ధరలను భారీగా పెంచుతూ సామాన్యుడి జేబుకు చిల్లు పెట్టింది.నయారా ఎనర్జీ దేశ వ్యాప్తంగా ఉన్న తన 7,000 అవుట్‌లెట్లలో లీటరు పెట్రోల్‌పై రూ. 5, డీజిల్‌పై రూ. 3 వరకు ధరలను పెంచింది. కొన్ని రాష్ట్రాల్లో వ్యాట్ ప్రభావంతో ఈ పెంపు రూ. 5.30 కి కూడా చేరింది. ఇండస్ట్రియల్ డీజిల్ ధరను లీటరుకు ఏకంగా రూ. 22 పెంచింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరల అస్థిరత, సప్లై చైన్ సమస్యలనే కారణాలుగా చూపుతూ ఈ పెంపును తక్షణమే అమలులోకి తెచ్చారు. అయితే, ఊరట కలిగించే విషయం ఏంటంటే... మార్కెట్‌లో 90 శాతం వాటా ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలియం, హిందుస్థాన్ పెట్రోలియం, మరో ప్రైవేట్ దిగ్గజం రిలయన్స్–బీపీ ప్రస్తుతానికి సాధారణ ఇంధన ధరలను స్థిరంగా ఉంచాయి.యుద్ధం ముదురుతున్న కొద్దీ ప్రభుత్వ రంగ సంస్థలు కూడా రేట్లను పెంచుతాయేమోనన్న భయంతో వాహనదారులు బంకుల వద్ద క్యూ కడుతున్నారు. పశ్చిమాసియా సంక్షోభం ఇప్పట్లో ముగియకపోతే దేశవ్యాప్తంగా పెట్రోల్ ధరలు ఎక్కడికో వెళతాయనే ఆందోళన కూడా వ్యక్తమవుతోంది.

# పంటపొలాల్లోనే ఏనుగుల తిష్ట

## ఆందోళనలో రైతులు

**చిత్తూరు,మార్చి , 26,( రిపబ్లిక్ న్యూస్)::** చంద్రగిరి మండలం, ఎగువ కూచివారిపల్లె పంట పొలాల్లో పగలు కూడా ఏనుగులు తిష్ట వేస్తున్నాయి. దీంతో రైతులు విలవిలలాడిపోతున్నారు. కొన్ని రోజులుగా ఏనుగుల మంద గ్రామంలోని పంట పొలాలపై పడి బీభత్సం సృష్టిస్తోంది. సాధారణంగా రాత్రి వేళల్లో వచ్చే ఏనుగులు, ఇప్పుడు ఏకంగా పట్టపగలే పొలాల్లో తిష్టవేస్తుండటంతో రైతులు ప్రాణభయంతో వణికిపోతున్నారు. బుధవారం ఎగువ కూచువారి పల్లె రైతుల పొలాల్లో ఏనుగులు మామిడి తోటలు, ఇతర పంటలను తొక్కి వేయడమే కాకుండా, చెట్ల కొమ్మలను విరిచివేసి భారీ నష్టాన్ని కలిగించాయి. సాగునీటి పైపులను, మోటార్లను సైతం ధ్వంసం చేస్తున్నాయి. అటవీ శాఖ అధికారులు తక్షణమే స్పందించి ఏనుగులను అడవిలోకి మళ్లించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. పంట నష్టపోయిన తమకు ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

# ఎర్రచందనం అక్రమ రవాణా కేసు

## వైసిపి నేతకు జైలు శిక్ష విధించిన కోర్టు

**చిత్తూరు,మార్చి , 26,( రిపబ్లిక్ న్యూస్)**

శేషాచలం అడవుల నుంచి ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన వైసీపీ నాయకుడికి తిరుపతి ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు జైలుశిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది. ఎర్రావారిపాలెం మండలం యనమలవారిపల్లెకు చెందిన ఉటుకూరి చెంగల్‌రెడ్డి, తిమ్మసముద్రానికి చెందిన వెంకట్‌రెడ్డి 2015వ సంవత్సరంలో శేషాచలం అడవుల నుంచి ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడ్డారు. వీరిపై భాకరాపేట స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. చెంగల్‌రెడ్డిపై నేరం రుజువు కావడంతో తిరుపతి ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి రెండేళ్ళ జైలు శిక్ష, రూ.20 వేల రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ఇ·బిస2.తూణజరిమానా చెల్లించకపోతే మరో మూడు నెలలు జైలు శిక్ష అనుభవించాల్సివుంటుందన్నారు. ఈ కీలకమైన కేసు విచారణ, పర్యవేక్షణ, కోర్టు లైజనింగ్‌లో కృషి చేసిన డీఎస్పీ ప్రసాద్, స్పెషల్ ప్రాసిక్యూటర్ అమరనారాయణ, అప్పటి ఎస్ఐ నెట్టి కంఠయ్య, ప్రస్తుత సీఐ సత్యనారాయణ, ఎస్ఐ కృష్ణయ్య, కోర్టు లైజనింగ్ హెడ్ కానిస్టేబుల్ హరినాథ్, కోర్టు హెడ్ కానిస్టేబుల్ నరసింహులును ఎస్పీ సుబ్బరాయుడు అభినందించారు. శిక్ష పడిన చెంగల్‌రెడ్డి భార్య రె÷–డడెమ్మ ప్రస్తుతం ఎర్రావారిపాలెం ఇన్‌చార్జ్ ఎంపీపీగా వుండగా చెంగల్‌రెడ్డి గతంలో మండల వైసీపీ అధ్యక్షుడిగా పనిచేశారు. ఈయనపై పలు ఎర్రచందనం అక్రమ కేసులు నమోదయ్యాయి.

# యాప్‌లకు బానిసగా మార్చారు..

## మెటా, యూట్యూబ్‌లకు జరిమానా!

**మార్చి , 26,( రిపబ్లిక్ న్యూస్)**

ప్రముఖ సోషల్ మీడియా సంస్థలు మెటా (ఇన్‌స్టాగ్రామ్ మాతృసంస్థ), యూట్యూబ్‌లకు అమెరికాలో భారీ ఎదురుదెబ్బ తగిలింది. తమ ప్లాట్‌ఫామ్‌లు వినియోగదారులను వ్యసనపరులుగా మార్చేలా ఉన్నాయని, ముఖ్యంగా పిల్లలు, టీనేజర్లపై వాటి ప్రభావం గురించి హెచ్చరించడంలో విఫలమయ్యాయని లాస్ ఏంజిల్స్ కోర్టు జ్యూరీ చారిత్రాత్మక తీర్పు వెలువరించింది. ఈ కేసులో బాధితురాలైన యువతికి 6 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.50 కోట్లు) నష్టపరిహారం చెల్లించాలని ఆదేశించింది.

### కేసు నేపథ్యం ఏమిటి?

కాలే జి.ఎమ్. అనే 20 ఏళ్ల యువతి ఈ కేసు దాఖలు చేసింది. చిన్నతనం నుంచే ఈ ప్లాట్‌ఫామ్‌ల వాడకం మొదలుపెట్టి, సంవత్సరాల తరబడి వాటికి బానిసగా మారానని ఆమె తన వాంగ్మూలంలో పేర్కొంది. దీనివల్ల తాను తీవ్రమైన ఆందోళన, డిప్రెషన్, బాడీ డిస్మార్ఫియా వంటి మానసిక సమస్యలతో బాధపడ్డానని తెలిపింది. ఆరేళ్ల వయసులో యూట్యూబ్ వీడియోలు చూడటం, తొమ్మిదేళ్లకే ఇన్‌స్టాగ్రామ్ ఖాతా తెరవడం చేశానని చెప్పింది. "ఎప్పుడూ వాటిపైనే ఉండాలనిపించేది. వాటిని




చూడకపోతే ఏదో కోల్పోతున్నాననే భావన కలిగేది" అని ఆమె కోర్టుకు వివరించింది.

యువతి తరఫు న్యాయవాది మార్క్ లానియర్ వాదిస్తూ, ఈ కంపెనీలు ఉద్దేశపూర్వకంగానే పిల్లలను ఆకట్టుకునేలా తమ ప్లాట్‌ఫామ్‌లను రూపొందించాయని ఆరోపించారు. "వారికి తెలుసు! వాళ్లు పిల్లలనే లక్ష్యంగా చేసుకున్నారు" అని ఆయన అన్నారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా ఉండాలంటే కఠినమైన శిక్ష విధించాలని కోరారు.

### కంపెనీల వాదన ఇదే..

అయితే, ఈ ఆరోపణలను మెటా, గూగుల్ యాజమాన్యాలు తోసిపుచ్చాయి. బాధితురాలి మానసిక సమస్యలకు వ్యక్తిగత పరిస్థితులు, స్కూల్‌లో ఎదురైన బెదిరింపులు కూడా కారణమై ఉండవచ్చని వాదించాయి. తమ ప్లాట్‌ఫామ్‌లు వ్యసనం కలిగించేలా రూపొందించలేదని మెటా సీఈవో మార్క్ జుకర్‌బర్గ్, ఇన్‌స్టాగ్రామ్ హెడ్ ఆడమ్ మోస్సేరి తెలిపారు. వినియోగదారుల సమయాన్ని పెంచడం తమ లక్ష్యం కాదని, వారికి ఉపయోగపడే సేవలు అందించడమే తమ ఉద్దేశమని జుకర్‌బర్గ్ చెప్పారు.

ఈ తీర్పుపై అప్పీల్‌కు వెళతామని మెటా, యూట్యూబ్ ప్రకటించాయి. యువత మానసిక ఆరోగ్యం చాలా సంక్లిష్టమైన అంశమని, దానికి ఒకే యాప్‌ను కారణంగా చూపలేమని మెటా ప్రతినిధి తెలిపారు. మరోవైపు యూట్యూబ్ ఒక స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ మాత్రమేనని, సోషల్ మీడియా సైట్ కాదని గూగుల్ ప్రతినిధి పేర్కొన్నారు.ప్రస్తుతం కాలిఫోర్నియాలోనే మెటా, యూట్యూబ్, స్నాప్‌చాట్, టిక్‌టాక్‌లపై ఇలాంటివి 3,000కు పైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో తాజా తీర్పు ఆ కేసులపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని, మరిన్ని సెటిల్‌మెంట్లకు దారితీయవచ్చని న్యాయ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# నేడు శ్రీరామనవమి వేడుక

## శోభాయాత్రకు భారీగా ఏర్పాట్లు -యాత్ర మార్గంలో ట్రాఫిక్ ఆంక్షలు

**హైదరాబాద్,మార్చి , 26,( రిపబ్లిక్ న్యూస్)**

శ్రీరామనవమి శోభాయాత్ర సందర్భంగా హైదరాబాద్ నగరంలో శుక్రవారం ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉండనున్నాయి. సీతారాంబాగ్ దేవాలయం నుంచి కోఠిలోని హనుమాన్ వ్యాయామశాల వరకు శోభాయాత్ర జరగనుంది. ఈ మార్గంలో వాహనాలకు అనుమతి ఉండదు. శోభాయాత్ర సమయంలో ట్రాఫిక్‌ను ఇతర మార్గాల్లోకి మళ్లించనున్నారు. సీతారాంబాగ్, బోయిగూడ కమాన్ నుంచి మల్లేపల్లి ఎక్స్ రోడ్స్ వైపు ట్రాఫిక్ మళ్లించనున్నారు. మంగళ్‌హాట్, గాంధీ విగ్రహం, పురానాపూల్, జుమేరాత్ బజార్ నుంచి వచ్చే వాహనాలను టక్కర్‌వాడీ జంక్షన్ వైపు డైవర్ట్ చేయనున్నారు. ఎంజే బ్రిడ్జ్, బేగంబజార్, అఫ్జల్‌గంజ్, సిటీ కాలేజీ వైపు వెళ్లే వాహనాలను జుమేరాత్ బజార్ మీదుగా మళ్లించనున్నారు. అబిడ్స్ జీపీఓ, సుల్తాన్ బజార్, కోఠి, అబిడ్స్ ప్రధాన రోడ్ల వద్ద ట్రాఫిక్‌ను నిలిపివేయనున్నారు. బేగంబజార్, అఫ్జల్‌గంజ్, ఎంజే మార్కెట్, కోఠి, కాచిగూడ ప్రాంతాల్లోనూ ట్రాఫిక్ రద్దీగా ఉండే అవకాశం ఉన్న నేపథ్యంలో అందుకు అనుగుణంగా



చర్యలు తీసుకునేందుకు హైదరాబాద్ పోలీసులు సిద్ధమవుతున్నారు. సీతారాంబాగ్ టెంపుల్ నుంచి సుల్తాన్‌బజార్ వరకు జరిగే ఈ శోభాయాత్ర మార్గంలో వాహనాలకు మళ్లింపులు అమలు చేస్తారు. ప్రత్యేకంగా బేగంబజార్, అఫ్జల్‌గంజ్, ఎంజే మార్కెట్, కోఠి, కాచిగూడ ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ ఉండే అవకాశం ఉంది. ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాలను ఉపయోగించాలని, ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని అధికారులు సూచించారు. శ్రీరామనవమి శోభాయాత్రను అత్యంత వైభవంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సర్వం సిద్ధమయ్యారు. 2010లో ప్రారంభమైన ఈ యాత్ర అతి తక్కువ కాలంలోనే దేశవ్యాప్త గుర్తింపు పొందిందని, సీతారాం బాగ్ నుంచి హనుమాన్ వ్యాయామశాల వరకు సాగే ఈ వేడుకను భక్తులు క్రమశిక్షణతో జరుపుకోవాలని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్

### పాక్‌పై దాడుల కథతో వివేక్ అగ్నిహోత్రి కొత్త సినిమా

# ‘ఆపరేషన్ సిందూర్‘

‘ది కశ్మీర్ ఫైల్స్‘, ‘ది వ్యాక్సిన్ వార్‘ వంటి చిత్రాలతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన దర్శకుడు వివేక్ అగ్నిహోత్రి తన తదుపరి ప్రాజెక్టును ప్రకటించారు. ‘ఆపరేషన్ సిందూర్‘ పేరుతో తెరకెక్కనున్న ఈ సినిమా కోసం ప్రముఖ నిర్మాణ సంస్థ టీ-సిరీస్ అధినేత భూషణ్ కుమార్‌తో చేతులు కలిపినట్లు ఆయన వెల్లడించారు. సరిహద్దు అవతల భారత సైన్యం నిర్వహించిన రహస్య సైనిక చర్యల ఆధారంగా ఈ చిత్రం ఉండబోతోందని తెలిపారు. ఈ సినిమా కథకు లెఫ్టినెంట్ జనరల్ కేజేఎస్ ‘టినీ‘ ధిల్లాన్ రాసిన “ఆపరేషన్ సిందూర్: ది అన్‌టోల్డ్ స్టోరీ ఆఫ్ ఇండియాస్ డీప్ స్ట్రైక్స్ ఇన్‌సైడ్ పాకిస్థాన్“ అనే పుస్తకం ఆధారం. ఈ విషయాన్ని వివేక్ అగ్నిహోత్రి ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నారు. “ఉపఖండంలో భద్రతా నిర్వచనాన్ని మార్చేసి, పాకిస్థాన్ అణు బూటకాన్ని బట్టబయలు చేసిన కథ ‘ఆపరేషన్ సిందూర్‘. దీనికోసం నేను, భూషణ్ కుమార్ చేతులు కలిపాం“ అని ఆయన తన పోస్ట్‌లో పేర్కొన్నారు. కేవలం సంచలనం సృష్టించడానికి కాదని, వాస్తవాలను స్పష్టంగా సినిమా మాధ్యమం ద్వారా చెప్పడానికే ఈ సినిమా తీస్తున్నట్లు వివరించారు. పుస్తకంలోని వివరాల ప్రకారం 2025 ఏప్రిల్ లో జమ్మూకశ్మీర్‌లోని పహల్గాం వద్ద జరిగిన ఉగ్రదాడిలో 26 మంది అమాయక పౌరులు ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడికి ప్రతీకారంగా భారత సైన్యం మేలో ‘ఆపరేషన్ సిందూర్‘ పేరుతో ఒక సైనిక చర్యను ప్రారంభించింది. ఈ ఆపరేషన్‌లో భాగంగా పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని జైషే మహ్మద్, లష్కరే తోయిబా వంటి ఉగ్రవాద సంస్థల స్థావరాలపై భారత్ మిస్సైల్ దాడులు చేసింది. ఈ వాస్తవ ఘటనల ఆధారంగా భారత సాయుధ దళాలలోని పలు విభాగాల నుంచి సమాచారం సేకరించి, క్షేత్రస్థాయిలో విస్తృతమైన పరిశోధన చేసి ఈ సినిమాను రూపొందిస్తున్నట్లు చిత్ర బృందం తెలిపింది. ఉపఖండ భద్రతా పరిణామాలను మార్చేసిన ఈ సైనిక వ్యూహాలను వెండితెరపై ఆవిష్కరించడమే ఈ సినిమా లక్ష్యమని వివేక్ అగ్నిహోత్రి స్పష్టం చేశారు.




### బాలకృష్ణకు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్..

# ఢిల్లీ సీఎం చేతుల మీదుగా ప్రదానం

ప్రముఖ సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అరుదైన గౌరవం అందుకున్నారు. భారతీయ చిత్ర పరిశ్రమకు దశాబ్దాలుగా అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఆయనకు ప్రతిష్ఠాత్మక ‘లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్’ (జీవితకాల సాఫల్య) పురస్కారం లభించింది. దేశ రాజధాని ఢిల్లీలో బుధవారం ప్రారంభమైన ‘అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఢిల్లీ (×ఖీఖీణ) 2026’ వేడుకల్లో ఆయన ఈ అవార్డును స్వీకరించారు.

ఢిల్లీలోని భారత్ మండపంలో ఘనంగా జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేఖా గుప్తా చేతుల మీదుగా బాలకృష్ణ ఈ పురస్కారాన్ని అందుకున్నారు. బాలకృష్ణతో పాటు సీనియర్ నటి షర్మిలా ఠాగూర్, దివంగత నటుడు ధర్మేంద్రకు కూడా జీవితకాల సాఫల్య పురస్కారాలను ప్రకటించారు. ధర్మేంద్ర తరఫున ఆయన కుటుంబ సభ్యులు ఈ అవార్డును స్వీకరించారు. ఈ వేడుకలను ఢిల్లీ సీఎం రేఖా గుప్తా, మంత్రులు కపిల్ మిశ్రా, పర్వేశ్ సాహిబ్ సింగ్ వర్మ, నటీమణులు హేమమాలిని, కంగనా రనౌత్, షర్మిలా ఠాగూర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. బాలకృష్ణకు ఈ గౌరవం దక్కడం పట్ల ఆయన అభిమానులు, సినీ ప్రముఖులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# గుండెలు పిండేసిన ప్రియాంక చోప్రా!

గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా కేవలం వెండితెరపైనే కాదు. నిజ జీవితంలోనూ ఎంతో మందికి స్ఫూర్తినిస్తుంటారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆమె చేసిన వ్యాఖ్యలు సామాన్య మధ్యతరగతి ప్రజల గుండెలను పిండేశాయి. సమాజంలో -విజయం- అనే పదానికి ఉన్న అర్థాన్ని ఆమె పూర్తిగా మార్చేసారు. ప్రతిరోజూ తమ ఇష్టం లేని పనిని కూడా బాధ్యత కోసం చేసేవారే అసలైన విజేతలని కొనియాడారు. -చాలా మందికి తాము చేసే ఉద్యోగాలంటే ఇష్టం ఉండదు. కానీ తమ కుటుంబాలను పోషించుకోవడానికి, పిల్లల భవిష్యత్తు కోసం, కడుపు నింపుకోవడం కోసం వారు ప్రతిరోజూ ఆ ఇష్టం లేని పనులకే వెళ్తుంటారు. అలాంటి వారు పడే కష్టం, వారు చూపే అంకితభావం నా దృష్టిలో అత్యంత గొప్ప విజయం అని పేర్కొన్నారు. కేవలం లక్ష్యాలను సాధించే వారు మాత్రమే విజేతలు కాదు. కడుపు నింపుకోవడానికి బాధ్యతలను మోసేవారు కూడా వీరులే అని పీసీ అభిప్రాయపడ్డారు. సాధారణంగా సెలబ్రిటీలు -మీకు నచ్చిన పనినే చేయండి.. అప్పుడే విజయం వస్తుంది- అని చెబుతుంటారు. కానీ ప్రియాంక మాత్రం చాలా మంది వాస్తవ జీవితాన్ని ప్రస్తావించారు. -ప్రతి ఒక్కరికీ తమకు నచ్చిన పని చేసే అవకాశం దొరకదు. ఇష్టం లేకపోయినా ముఖంపై చిరునవ్వుతో బాధ్యతను నెరవేర్చే వ్యక్తిలో ఉండే ఆత్మస్థైర్యం సామాన్యమైంది కాదు. ఆ పట్టుదలే వారిని నా దృష్టిలో ఒక సూపర్ హీరోని చేస్తుంది- అని చెప్పుకొచ్చారు. ఇప్పుడీ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తూ ఒత్తిడిలో ఉన్న యువత, ప్రియాంక మాటలతో ఎంతో ఊరట పొందుతున్నారు. ఒక స్టార్ హోదాలో ఉండి కూడా సామాన్యుల కష్టాలను, వారి జీవన పోరాటాన్ని ఇంత సున్నితంగా అర్థం చేసుకోవడం ప్రియాంకలోని మానవత్వాన్ని చాటి చెబుతోందని నెటిజన్లు ప్రశంసిస్తున్నారు. ప్రియాంక చోప్రా చేసిన వ్యాఖ్యలు సక్సెస్ అనే మాటకు ఒక కొత్త నిర్వచనాన్ని ఇచ్చింది. కెరీర్ లో ఎత్తుపల్లాలను చూసి కుంగిపోకుండా? కుటుంబాన్ని కాపాడుకోవడమే అతిపెద్ద లక్ష్యంగా పెట్టుకుని పోరాడే ప్రతి సామాన్యుడికి ఆమె మాటలు ఒక పెద్ద సెల్యూట్ లా నిలిచాయి.




# ప్రధాని మోదీపై ‘కాంతార‘ నటుడు ఫైర్

అంతర్జాతీయ ఉద్రిక్తతలు, ఇంధన కొరత నేపథ్యంలో దేశ ప్రజలందరూ ఐకమత్యంగా ఉండాలని ప్రధాని మోదీ పిలుపునివ్వడంపై ‘కాంతార‘ నటుడు కిషోర్ సోషల్ మీడియా వేదికగా విరుచుకుపడ్డారు. గత పదేళ్లలో దేశాన్ని కులమతాల వారీగా విడగొట్టి, ఇప్పుడు ఏ మొహం పెట్టుకుని కలిసి ఉండాలని అడుగుతున్నారని ఆయన ప్రశ్నించారు.

దేశాన్ని హిందువులు, ముస్లింలు, క్రైస్తవులుగా విడగొట్టి ప్రజల మధ్య ద్వేషాన్ని నింపిన తర్వాత, ఇప్పుడు విపత్తులు వస్తున్నాయని అందరినీ ఏకం కావాలని కోరడం విడ్డూరంగా ఉందని ఆయన విమర్శించారు. నోట్ల రద్దు, రఫేల్ ఒప్పందం, కరోనా లాక్‌డౌన్, అగ్నివీర్, వ్యవసాయ చట్టాల వంటి కీలక నిర్ణయాల సమయంలో ప్రజలను, ప్రతిపక్షాలను కనీసం సంప్రదించారా? అని నిలదీశారు. కరోనా సమయంలో సుమారు 50 లక్షల మంది భారతీయులు ప్రాణాలు కోల్పోయినా ప్రభుత్వం వారిని లెక్కలోకి తీసుకోలేదని కిషోర్ మండిపడ్డారు. ప్రజలు గొర్రెల మందలా చావడానికి సిద్ధంగా లేరని హెచ్చరించారు. మణిపూర్, కశ్మీర్, లడఖ్ సమస్యలపై ప్రధాని మౌనాన్ని ఆయన తప్పుబట్టారు.

యుద్ధ నేరాలకు పాల్పడుతున్న దేశాధినేతలను (ఇజ్రాయెల్) కౌగిలించుకునే ముందు ప్రజల అనుమతి తీసుకున్నారా? అని ప్రశ్నిస్తూ, ప్రధాని తీరును ‘నాన్-బయోలాజికల్ మ్యాడ్నెస్‘ (అశాస్త్రీయమైన వెర్రితనం)గా అభివర్ణించారు. దేశ అత్యున్నత పదవికి గౌరవం ఇవ్వలేని వారు ఆ పదవి నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేశారు.



# కరుప్పు.. సూర్య కమ్ బ్యాక్ పక్కా?

కోలీవుడ్ స్టార్ హీరోల్లో సూర్య స్టైల్ ప్రత్యేకం. రెగ్యులర్ కమర్షియల్ సినిమాలకు పూర్తి భిన్నంగా కథాబలమున్న సినిమాలతో పాటు సరికొత్త కథలు, క్యారెక్టర్లతో ప్రత్యేక గుర్తింపుని సొంతం చేసుకున్న సూర్య గత కొంత కాలంగా వరుస ఫ్లాపులు, డిజాస్టర్లతో సతమతమవుతూ రేసులో వెనబడిపోయారు. ఒక దశలో వరుస బ్లాక్ బస్టర్లని సొంతం చేసుకున్న సూర్య ఇప్పుడు సరైన హిట్ల కోసం ఎదురు చూస్తున్నాడు. -జైభీమ్- తరువాత సూర్య హిట్టు మాట విని ఏళ్లు గడుస్తున్నాయి. సామాజిక సమస్య నేపథ్యంలో చేసిన -ఈటీ- ఫలితాన్ని ఇవ్వలేదు.

భారీ అంచనాలతో పాన్ ఇండియా వైడ్‌గా సంచలనాలు సృష్టించాలని చేసిన ఫాంటసీ యాక్షన్ మూవీ -కంగువా- బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్‌గా నిలిచి షాక్ ఇచ్చింది. రూ.300 కోట్ల భారీ బడ్జెట్‌తో నిర్మిస్తే అందులో రూ.100 కోట్లు మాత్రమే తిరిగి రాబట్టి డిజాస్టర్‌గా బాప్ అనిపించుకుంది. రొమాంటిక్ యాక్షన్ డ్రామాగా చేసిన -రెట్రో- కూడా ఇదే ఫలితాన్ని అందించి సూర్యని ఆలోచనలో పడేసింది. దీంతో కంగారుపడిన సూర్య ఆలోచించి అడుగులు వేయడం మొదలు పెట్టారు.

సక్సెస్ కోసం ఆర్జే బాలాజీ చెప్పిన -కరుప్పు- కథని నమ్మి రూటెడ్ స్టోరీతో సినిమా చేశారు. త్రిష కథానాయికగా నటించిన ఈ మూవీ రిలీజ్‌కు రెడీ అయినా ప్రస్తుతం ఉన్న పోటీ దృష్ట్యా మేకర్స్ ఈ మూవీ రిలీజ్‌ని మే 14కు వాయిదా వేశారు. దీనితో పాటు తెలుగు డైరెక్టర్ వెంకీ అట్లూరితో కలిసి తెలుగు స్ట్రెయిట్ ఫిల్మ్ -విశ్వనాథ్ అండ్ సన్స్- చేశారు.



# ఓవైపు కామెడీ.. ఓవైపు హారర్.. ఆసక్తికరంగా ‘రాకాస’ ట్రైలర్

సంగీత్ శోభన్, నయన్ సారిక జంటగా నటిస్తున్న చిత్రం ‘రాకాస’. హారర్ కామెడీ జోనర్‌లో ఈ సినిమాను మాసన శర్మ తెరకెక్కించారు. ఇప్పటికే విడుదలైన సినిమా టీజర్, పాటలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ని విడుదల చేశారు. ఓవైపు కామెడీతో నవ్వులు పూయిస్తూనే.. మరోవైపు హారర్‌తో భయపెడుతోంది ఈ సినిమా ట్రైలర్. ఇక ఈ సినిమాలో గెటప్ శ్రీను, తనికెళ్ల భరణి, బ్రహ్మాజీ తదితరులు కీలక పాత్రలు పోషించారు. అనుదీప్ దేవ్ ఈ సినిమాకి సంగీతం అందించాడు. పింక్ ఎలిఫాంట్ పిక్చర్స్ బ్యానర్‌పై నిహారిక కొణిదెల ఈ సినిమాని నిర్మించింది. ఈ సినిమా ఏప్రిల్ 3వ తేదీన విడుదల కానుంది. ఈ సినిమా ట్రైలర్‌ని మీరు చూసేయండి...



# ముగ్గురిపై జిల్లా బహిష్కరణ

## కర్నూలులో శాంతిభద్రతల కోసం కఠిన చర్యలు -ఇప్పటివరకు 8 మందిపై ఆదేశాలు














**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 26)**
జిల్లాలో శాంతిభద్రతలకు భంగం కలిగించే కార్యకలాపాలకు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులపై జిల్లా బహిష్కరణ చర్యలు తీసుకున్నట్లు జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి, ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు.కర్నూలు తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలోని పి. రుద్రవరం గ్రామానికి చెందినమిట్టగేరి కుర్వ వెంకటేశ్వర్లుకుర్వ మధు(అలియాస్) పుండుకూర మధుమిట్టగేరి కుర్వ మధసూధన్ (అలియాస్) మధుపై వ్యక్తులు చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నందున జిల్లా బహిష్కరణ ఉత్తర్వులు జారీ చేసినట్లు వెల్లడించారు.వీరిలో వెంకటేశ్వర్లుపై రౌడీషీట్ నం. 140, మధుపై రౌడీషీట్ నం. 141 నమోదై ఉన్నట్లు తెలిపారు. గతంలో హత్య వంటి తీవ్రమైన నేరాల్లో పాల్గొన్న వీరు పలుమార్లు రిమాండ్‌కు వెళ్లినప్పటికీ ప్రవర్తనలో మార్పు లేకపోవడంతో, ప్రజల్లో భయాందోళనలు కలిగించే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.

ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ, ఇప్పటివరకు జిల్లాలో చెడు నడత కలిగిన మొత్తం 8 మందిపై జిల్లా బహిష్కరణ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. వీరిలో వడ్డే రామాంజనేయులు, పటాన్ ఇమ్రాన్ ఖాన్, వడ్డే తులసి కుమార్, వడ్డే రేవంత్ కుమార్, వడ్డే శివ కుమార్, అలాగే తాజాగా ముగ్గురు వ్యక్తులు ఉన్నారని చెప్పారు.

జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై ఇలాంటి చర్యలు కొనసాగుతాయని, అవసరమైతే పీడీ యాక్ట్ నమోదు చేసి జైలుకు తరలిస్తామని హెచ్చరించారు. ప్రజలు ప్రశాంతంగా, చట్టబద్ధంగా జీవించాలని సూచించారు.

ఇంకా పలువురు చెడు నడత కలిగిన వ్యక్తులపై జిల్లా బహిష్కరణ చర్యలు పరిశీలనలో ఉన్నాయని ఎస్పీ తెలిపారు.

# పిల్లల భద్రతపై అప్రమత్తం కావాలి

### కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్

### ఈత రాని పిల్లలను కాల్వలు, చెరువులు, నదుల వద్దకు వెళ్లనీయవద్దని సూచన

### ప్రమాదాల నివారణకు తల్లిదండ్రులకు మార్గదర్శకాలు



**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 26)**
వేసవికాలపు సెలవులు ప్రారంభమవుతున్న నేపథ్యంలో చిన్నపిల్లల భద్రతపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ సూచించారు. ఈత రాని పిల్లలు కాల్వలు, కుంటలు, చెరువులు, నదుల వద్దకు వెళ్లడం వల్ల ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఆయన గురువారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

ప్రత్యేకంగా గ్రామాలు, పల్లెలు మరియు పట్టణ శివారు ప్రాంతాల్లో ఉన్న నీటి వనరుల వద్ద పిల్లలు అకస్మాత్తుగా జారిపడే ప్రమాదం ఉండటంతో ప్రతి సంవత్సరం ఇటువంటి ఘటనలు జరుగుతున్నాయని ఎస్పీ పేర్కొన్నారు.

**తల్లిదండ్రులకు సూచనలు:**
చిన్నపిల్లలను ఒంటరిగా బయటకు వెళ్లనీయవద్దు.కాల్వలు, కుంటలు, చెరువులు, నదుల దగ్గరకు వెళ్లకుండా పర్యవేక్షించాలి.ఈత రాని పిల్లలను నీటి ప్రాంతాలకు వెళ్లకుండా కట్టుదిట్టంగా నియంత్రించాలి.పిల్లలకు నీటి ప్రమాదాలపై అవగాహన కల్పించాలి.లోతైన ప్రాంతాలను గుర్తించి పిల్లలు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.ప్రమాదం జరిగిన వెంటనే పోలీసులకు లేదా డయల్ 112 / 100 కు సమాచారం ఇవ్వాలి.వేసవికాలంలో పిల్లల భద్రతను కాపాడేందుకు తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ విజ్ఞప్తి చేశారు.

# రేషన్ సరుకుల పంపిణీలో జాప్యం ఉండకూడదు: కలెక్టర్ డా.ఏ. సిరి


### వెల్దుర్తిలో ఎంఎల్ఎస్ పాయింట్ ఆకస్మిక తనిఖీ -నిల్వలు, నాణ్యత, పంపిణీపై సమగ్ర పరిశీలన



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 26)**
ప్రజలకు అందించే రేషన్ సరుకుల పంపిణీ ప్రక్రియలో ఎటువంటి జాప్యం జరగకూడదని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి స్పష్టం చేశారు.గురువారం వెల్దుర్తి మండల కేంద్రంలో జాయింట్ కలెక్టర్‌తో కలిసి పౌర సరఫరాల ఎంఎల్ఎస్ పాయింట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆమె, గోదాంలో నిల్వ ఉన్న బియ్యం, జొన్నలు, కంది పప్పు వంటి నిత్యావసర సరుకుల నిల్వ స్థితి, నాణ్యత, పంపిణీ విధానాన్ని సమగ్రంగా పరిశీలించారు.సరుకుల నిల్వలో ఎటువంటి లోపాలు లేకుండా పరిశుభ్రత పాటించాలని, రేషన్ దుకాణాలకు సరుకులు సమయానికి చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రేషన్ సరఫరాలో అవకతవకలు జరగకుండా పర్యవేక్షణ కొనసాగించాలని, నిర్లక్ష్యం వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అదేవిధంగా స్టాక్ రిజిస్టర్‌లు, రవాణా రికార్డులు, పంపిణీ వివరాలను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. 65 సంవత్సరాలు పైబడినవారికి మరియు దివ్యాంగులకు హోమ్ డెలివరీ సేవలను మార్చి 26 నుంచి 30వ తేదీ లోపు వంద శాతం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, డిఎస్ఓ రాజా రఘువీర్, అగ్ని మాపక శాఖ అధికారి జయసింహ తదితరులు పాల్గొన్నారు.

# కర్నూలులో అబ్జర్వేషన్ హోమ్ ఆకస్మిక తనిఖీ

### పిల్లలకు ఉచిత న్యాయ సహాయం అందిస్తామని కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి హామీ



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 26)**జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. కబర్ధి సూచనల మేరకు, కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి గురువారం కర్నూలులోని అబ్జర్వేషన్ హోమ్ ఫర్ బాయ్స్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన కార్యాలయ రిజిస్టర్లను పరిశీలించి, పిల్లలకు అందిస్తున్న ఆహారం మరియు వసతి సదుపాయాలను సమీక్షించారు. అక్కడ ఉన్న బాలలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఎవరికైనా న్యాయవాది లేకపోతే, ఉచితంగా న్యాయవాదిని నియమించి కేసులను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.అలాగే, లీగల్ సర్వీసెస్ అథారిటీ ద్వారా అందించే ఉచిత న్యాయ సహాయం, 1987 చట్టం ప్రకారం బాలలకు ఉన్న హక్కులపై అవగాహన కల్పించారు.తరువాత అదే ప్రాంగణంలో ఉన్న జువెనైల్ జస్టిస్ బోర్డు కార్యాలయం, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ కార్యాలయాలను సందర్శించి, రికార్డులను పరిశీలించారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు పిల్లల పట్ల తీసుకుంటున్న చర్యలను గురించి అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో అబ్జర్వేషన్ హోమ్ సూపరింటెండెంట్ హుస్సేన్ బాష, సిడబ్ల్యూసీ చైర్మన్ జుబేదా బేగం, కమిటీ సభ్యులు మరియు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీరామనవమి పండుగ సందర్భంగా సేవా భావం

### విజయ్ భరత్ రెడ్డి



**గుత్తి మార్చి 26 (రిపబ్లిక్ న్యూస్)** గుత్తి మండలం తొండపాడు గ్రామం శ్రీరామనవమి పండుగ సందర్భంగా తురకపల్లి గ్రామానికి చెందిన సాఫ్ట్ వేర్ విజయ్ భరత్ రెడ్డి, సీత రాముల కళ్యాణం మహోత్సవానికి భక్తిశ్రద్ధలతో వచ్చిన భక్తాదులకు అన్నదాన కార్యక్రమానికి,గురువారం తురకపల్లి గ్రామం తెలుగుదేశం పార్టీ నాయకులు చేతుల మీదుగా లక్ష్మీ రంగయ్య చిన్నాకు 5,116, /- విరాళం అందజేశారు, కార్యక్రమంలో బి.లక్ష్మి రంగయ్య , సి. రంగస్వామి , బి. రంగారెడ్డి , డి.ఆది , వి.చిన్న ,కె.హనుమంత్ రెడ్డి , పి. జయపాల్ (స్టోర్ డీలర్ ) , కె. నాగేశ్వర్ రెడ్డి , శివన్న , జయరాముడు ,పి. శంకర్ , లక్ష్మి నారాయణ (స్టోర్ డీలర్ )తురకపల్లి గ్రామ నాయకులు తదితరులు. పాల్గొన్నారు

# గ్యాస్ డెలివరీలో అక్రమాలు చేస్తే కఠిన చర్యలు

### వెల్దుర్తి ఇండెన్ గ్యాస్ గోడౌన్‌పై కలెక్టర్ ఆకస్మిక తనిఖీ -లోపాలు గుర్తింపు



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 26)**
గ్యాస్ డిస్ట్రిబ్యూటర్లు గ్యాస్ డెలివరీలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి హెచ్చరించారు.

గురువారం వెల్దుర్తి మండల కేంద్రంలోని సంపూర్ణ ఇండెన్ గ్యాస్ గోడౌన్‌ను కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా గ్యాస్ సరఫరా వివరాలను పరిశీలించిన కలెక్టర్, రోజువారీ సరఫరా స్థితిపై అధికారులను ప్రశ్నించారు. స్టాక్ తనిఖీలో 6 డొమెస్టిక్ సిలిండర్లు, 11 కమర్షియల్ సిలిండర్లు తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. దీనిపై అసంతృప్తి వ్యక్తం చేసిన కలెక్టర్, గ్యాస్ ఏజెన్సీ యాజమాన్యానికి వెంటనే నోటీసులు జారీ చేయాలని డీఎస్ఓకు ఆదేశించారు.

అలాగే గోడౌన్ పరిధిలో అగ్ని మాపక భద్రతా నిబంధనలు పాటించకపోవడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ, తక్షణ చర్యలు తీసుకోవాలని అగ్నిమాపక శాఖ అధికారిని ఆదేశించారు.

గ్యాస్ డెలివరీ బాయ్‌లకు సరైన జీతభత్యాలు చెల్లించాలని, లేదంటే వారు వినియోగదారుల నుంచి అధికంగా వసూలు చేసే పరిస్థితి వస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. వినియోగదారుల నుంచి అదనపు డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జిల్లాలో గ్యాస్ కొరత లేదని, సుమారు 18 వేల సిలిండర్లు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు ఆందోళన చెందవద్దని కలెక్టర్ స్పష్టం చేశారు.

జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్ మాట్లాడుతూ, గ్యాస్‌ను పొదుపుగా వినియోగించాలని, డొమెస్టిక్ సిలిండర్లను వంట అవసరాలకు మాత్రమే ఉపయోగించాలని సూచించారు. గీజర్లు, వాహనాలు లేదా ఇతర అవసరాలకు వాడరాదని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఆర్డీఓ సందీప్ కుమార్, డీఎస్ఓ రాజా రఘువీర్, అగ్నిమాపక శాఖ అధికారి జయసింహ, లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ రాముడు తదితరులు పాల్గొన్నారు.

# కర్నూల్లో ఘరానా మోసం

## ఉమ్రా పేరుతో కోట్ల దోపిడీ


### వేలాది మందిని మోసం చేసిన అబ్దుల్ రహేమాన్ పట్టుబాటు

### డబ్బులు ట్రేడింగ్‌లో పోయాయని అంగీకారం



**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 26)**
కర్నూలు జిల్లాలో ఘరానా మోసం వెలుగులోకి వచ్చింది. ఉమ్రా, బాగ్దాద్ తీర్థయాత్రల పేరుతో వేలాది మందిని మోసం చేసి కోట్ల రూపాయలు దోచుకున్న అబ్దుల్ రహేమాన్ అనే వ్యక్తి చివరకు బాధితుల చేతికి చిక్కాడు.బాధితుల వివరాల ప్రకారం, నిందితుడు ఏజెంట్ల ద్వారా సుమారు 1500 మందికి పైగా నుంచి ఒక్కొక్కరితో రూ.40 వేల చొప్పున వసూలు చేసినట్టు తెలుస్తోంది. కర్నూలులోని ఒక దర్గా కేంద్రంగా ఈ వ్యవహారం నడిచినట్టు సమాచారం. కేవలం కర్నూలులోనే రూ.5 కోట్లకు పైగా వసూలు చేసినట్టు చెబుతుండగా, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో కలిపి సుమారు రూ.80 కోట్ల వరకు వసూలు చేసినట్టు బాధితులు ఆరోపిస్తున్నారు.గత కొంతకాలంగా పరారీలో ఉన్న అబ్దుల్ రహేమాన్ ఎట్టకేలకు కర్నూలులో బాధితుల చేతికి చిక్కాడు. తమ డబ్బులు తిరిగి ఇవ్వాలని బాధితులు, ఏజెంట్లు అతన్ని నిలదీయడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.పోలీసుల ముందు నిందితుడు బాధితుల నుంచి డబ్బులు తీసుకున్నట్టు అంగీకరించాడు. ఆ డబ్బును ట్రేడింగ్‌లో పెట్టి నష్టపోయానని చెప్పిన అతను, కొంత సమయం ఇస్తే అందరికీ డబ్బులు తిరిగి చెల్లిస్తానని హామీ ఇచ్చాడు.ఈ ఘటనతో బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తుండగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు

# శక్తి యాప్ ఆవశ్యకత గురించి విస్తృతంగా అవగాహన






**నంద్యాల క్రైం, మార్చి 26, (రిపబ్లిక్ న్యూస్):**
జిల్లా వ్యాప్తంగా మహిళల భద్రతపై భరోసా కల్పించేందుకు,నేర నియంతరణ, ఈవ్ టీజింగ్ అరికట్టేందుకు శక్తి యాప్ ఆవశ్యకతను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకొని వెళ్లాలన్నా జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆదేశాల మేరకు నంద్యాల జిల్లా వ్యాప్తంగా గురువారం పోలీస్ అధికారులు వారి సిబ్బంది, శక్తి టీం బృందాలు స్కూల్లో, కళాశాలలో, ముఖ్యమైన కూడళ్లలో షాపింగ్ మాల్స్ బస్టాండ్, రైల్వే స్టేషన్లలో శక్తి యాప్ యొక్క ఆవశ్యకతపై విస్తృతంగా అవగాహన కల్పించడం జరుగుతుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల రక్షణకవచం “శక్తి“ యాప్ అని, రాష్ట్ర ప్రభుత్వం మహిళల భద్రత కోసం ఏర్పాటుచేసిన శక్తి యాప్ ప్రతి మహిళ తప్పక డౌన్లోడ్ చేసుకోవాలి. శక్తియాప్ డౌన్లోడ్ చేసుకోవడం వల్ల విపత్కర పరిస్థితులలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని రక్షిస్తారు. శక్తీ బృందాలచే జిల్లా వ్యాప్తంగా బస్టాండ్, రైల్వే స్టేషన్స్, దుకాణాలు, ఇతర ప్రదేశాలలో విస్తృతంగా ప్రజలకు, మహిళలకు, విద్యార్థినిలకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. మహిళల రక్షణ కవచం శక్తి యాప్ అని, ప్రతి ఒక్క మహిళ, గృహిణులు, విద్యార్థినిలు, బాలికలు మొబైల్లో శక్తి యాప్ ను డౌన్లోడ్ చేసుకుని ఆపద సమయంలో పోలీస్ వారి తక్షణపు సహాయం పొందాలని తెలిపారు. మొబైల్ లో శక్తి యాప్ ను డౌన్లోడ్ చేసుకునే విధానం, దాని ఉపయోగాలు, బాల్య వివాహాలు, బాల కార్మిక, వెట్టిచాకిరీ వ్యవస్థలు, మానవ అక్రమ రవాణా, ఫోక్సో యాక్ట్, మాదకద్రవ్యాల నిషేధం, డయల్ 100, 112, 1098, 1930 మొదలగు అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com